

కివీస్ చారిత్రక విజయం

6

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 85 | విజయవాడ, ఆదివారం 27 అక్టోబర్ 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 27 October 2024 | Rs



గోదావరి వరదల కారణంగా ఈ ఏడాది జులైలో నిలిచిన పాపికొండల విహారయాత్ర శనివారం ప్రారంభమైంది. తొలిరోజే అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయం వద్ద ఉన్న బోటింగ్ పాయింట్ నుంచి ఒక బోటు 41 మంది పర్యాటకులతో విహారయాత్రకు బయలుదేరి వెళ్లింది.

ప్రజాశక్తి- దేవీపట్నం (అల్లూరి జిల్లా)

మత్స్యకార భృతి ఏదీ?

- నాలుగు నెలలుగా ఎదురు చూపులు
- రీ సర్వే పేరుతో ప్రభుత్వం కాలయాపన
- వరుస అల్పపీడనాలతో సాగని చేపల వేట



శ్రీకాకుళం జిల్లా మరువాడలో వేట లేక వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

చేపల వేట నిషేధ సమయం ముగిన నాలుగు నెలలు అవుతున్నా మత్స్యకార భృతి నేటికీ అందలేదు. సర్వేల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. భృతి అందక, రాష్ట్రంలో వరుస అల్పపీడనాలతో చేపల వేట సాగక మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే భృతి ఇవ్వాలని, తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. చేపల వేట నిషేధ పరిహారం చెల్లింపుల విషయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా తీవ్ర జాప్యం జరుగుతోంది. మత్స్యకారులకు ఏటా మేలో దీనిని చెల్లించేవారు. ఇప్పుడు నిషేధం ఎత్తేసి సుమారు నాలుగు నెలలు కావొస్తున్నా వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు చేపల వేటపై నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు రూ.10 వేలు చొప్పున పరిహారం ప్రభుత్వాలు ఏటా తప్పకుండా ఇస్తూ వస్తున్నాయి. ఈ మొత్తానికి మరో రూ.10 వేలు కలిపి రూ.20 వేలు ఇస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, నేటికీ పరిహారం డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో, మత్స్యకారులు మత్యశాఖ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతూ తమకు పరిహారం డబ్బులు ఎప్పుడు ఇస్తారంటూ అడుగుతున్నారు. వేట నిషేధ సాయం అందజేతకు మరోసారి సర్వే చేస్తామని ప్రభుత్వం చెప్పున్నా... ఇప్పటివరకూ అందుకు సంబంధించి మార్గదర్శకాలను వెలువరించలేదు. 2024 మే 3, 4 తేదీల్లో డేటా వెరిఫికేషన్, నమోదు జరిగింది. మే 6 నుంచి 10 వరకూ డేటాను నవశకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. మే 14న గ్రామసచివాలయాల్లో జాబితాను ప్రదర్శించారు. మే 15 నుంచి 17 వరకూ అభ్యంతరాలను స్వీకరించారు. 18, 19 తేదీల్లో అభ్యంతరాలను పరిశీలించారు. మే 22న తుది జాబితా రూపొందించారు. జూన్ మొదటి వారంలో ప్రభుత్వానికి అధికారులు ఈ జాబితాను పంపారు. 1,30,128 మంది మత్స్యకారుల్లో 1,05,387 మందిని అర్హులుగా తేల్చారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వంలో రూపొందించిన జాబితాపై రీ సర్వేకు ఆదేశించింది. ఇందుకు సంబంధించి యాప్‌ను పంపనున్నట్లు అధికారులకు తెలిపింది. నేటికీ యాప్‌ను పంపకపోవడంతో సర్వే జరగలేదు. మత్స్యకారులకు జీవన భృతి నేటికీ అందలేదు. గత ఏడాది మేలోనే వేట నిషేధ సాయం అందింది. ఈ ఏడాది జులై నుంచి బంగాళాఖాతంలో తరచూ వాయుగుండాలు ఏర్పడుతూనే ఉన్నాయి. తమిళనాడు తీరంలో వాయుగుండాలు ఏర్పడినా, ఒడిశాలో తుపాన్లు సంభవించినా వేటకు వెళ్లొద్దంటూ అధికారులు హెచ్చరిస్తుండడంతో మత్స్యకారులకు పూట గడవడం కష్టంగా ఉంది. తాజాగా దానా తుపానుతో మూడు రోజులు పాటు వారు ఇళ్లకే పరిమితమయ్యారు.

పరిహారం వెంటనే అందించాలి

ప్రభుత్వం వెంటనే మత్స్యకార భరోసా డబ్బులు ఇవ్వాలి. హామీ ఇచ్చిన విధంగా రూ.20 వేలు ఇవ్వాలి. గత నాలుగేళ్లు మేలోనే డబ్బులు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. 2024కు సంబంధించి నేటికీ అందలేదు. మూడు నెలలుగా చేపల వేట సరిగా సాగడం లేదు. వాయుగుండం ఏర్పడితే వారం, పది రోజుల వరకు సముద్రంలోకి వేటకు వెళ్లే అవకాశం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం.

- జి.లోకేశ్వరరావు, మత్స్యకారుడు, మరువాడ (శ్రీకాకుళం జిల్లా)

కుటుంబ పోషణకు అప్పులు

వేటకు వెళ్లి నాలుగు చేపలు పట్టుకుని వచ్చిన డబ్బులతోనే మాకు రోజు గడుస్తుంది. నెలలో ఎక్కువ రోజులు వేట సాగకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. కుటంబ అవసరాల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద నెలకు రూ.2 చొప్పున రూ.20 వేలు అప్పు తెచ్చాను. వేటలేని కాలానికి మాకు ఏదో విధంగా ప్రభుత్వం సాయం చేయాలి.

-సూరాడ కొర్లయ్య, మత్స్యకారుడు, మరువాడ (శ్రీకాకుళం జిల్లా)

ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి

- నలుగురు సైనికులు మృతి
- ఖండించిన ప్రపంచ దేశాలు

టెహరాన్ : గాజాపై యుద్ధంలోకి ఇరాన్‌ను లాగేందుకు ఇజ్రాయిల్ ఆ దేశంపై వైమానిక దాడికి దిగింది. ఇరాన్‌కు గట్టి మద్దతుదారుగా ఉన్న హమాస్ నేత హనియే, హిజ్బుల్లా చీఫ్ నస్రుల్లాలను హత్య చేయడం ద్వారా ఇజ్రాయిల్ ఈ యుద్ధాన్ని పశ్చిమాసియా అంతటికీ విస్తరించాలని ప్రణాళిక వేసింది. దానిలో భాగమే ఇజ్రాయిల్ తాజా దాడి. అక్టోబర్1న ఇరాన్ జరిపిన క్షిపణి దాడికి ప్రతీకారంగానే ఈ చర్య తీసుకున్నామని ఇజ్రాయిల్ చెబుతున్నప్పటికీ దాని అసలు లక్ష్యం ఇరాన్‌ను దెబ్బతీయాలన్నదే. ఇరాన్ సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడి చేశామని చెప్పింది. శనివారం తెల్లవారు జామున దాదాపు 20 లక్ష్యాలపై వందల కొద్దీ యుద్ధ విమానాలతో దాడి చేసింది. తమ వైమానిక రక్షణ వ్యవస్థలు ఆ దాడులన్నింటినీ విజయవంతంగా తిప్పికొట్టాయని ఇరాన్ చెప్పుకుంది. ఈ దాడుల్లో నలుగురు సైనికులు మరణించారని, కొన్ని ప్రాంతాల్లో పరిమిత నష్టం జరిగిందని పేర్కొంది. శుక్రవారమంతా జరిగిన పరిణామాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు ఎప్పటికప్పుడు తెలియజేశామని ఇజ్రాయిల్ అధికారి ఒకరు తెలిపారు. శనివారం నాటి ఆపరేషన్ గురించి జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్‌కు కూడా తెలియజేశామన్నారు.

కాగా, ఇరాన్‌పై దాడిని సౌదీ అరేబియా, ఇరాక్‌లతో సహా పలు ముస్లిం దేశాలు తీవ్రంగా ఖండించాయి. పలువురు ప్రపంచ నేతలు ఈ దాడిని ఖండిస్తూ, ఇజ్రాయిల్ సంయమనంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్ దాడులకు తగిన రీతిలో జవాబిస్తామని ఇరాన్ నేతలు హెచ్చరించారు. 'మమ్మల్ని మేం రక్షించుకునే హక్కు మాకు వుంది. అందుకు తగినట్లే స్పందిస్తాం' అని ఇరాన్ ఎంపీ ఒకరు పేర్కొన్నారు.



విజయవాడలో విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల కాపీలను దహనం చేస్తున్న సిపిఎం నేతలు సిహెచ్.బాబూరావు, డి.కాశీనాథ్ తదితరులు

విద్యుత్తు భారాలపై ప్రజాగ్రహం

సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా

నియంత్రణ మండలి ఆదేశాల కాపీలు దహనం

5

మరో రూ.11,826 కోట్ల భారం

విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలపై మరో రూ.11,826.42 కోట్ల భారం పడనుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. 2022-23 ఏడాదికి సంబంధించిన రూ.6072 కోట్ల సర్దుబాటు చార్జీల భారం విద్యుత్ వినియోగదారులపై మోపుతూ ఎపిఇఆర్‌సి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2023-24 ఏడాదికి సంబంధించిన రూ.11,826.42కోట్ల భారాలను డిస్కంలు రెండేళ్ల క్రితమే ప్రజల నుంచి వసూళ్ల చేస్తామని ఎపిఇఆర్‌సిని కోరాయని తెలిపారు. జెన్‌కోను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ప్రజావసరాల పేరుతో యథేచ్ఛగా ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక ధరలకు కొనుగోళ్ల చేసిందన్నారు. అందువల్లే భారాలు వేయాల్సివస్తోందన్నారు.

ఇసుకపై ప్రయివేటు పెత్తనం వద్దు

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


ఇసుక రీచ్‌ల నిర్వహణ, తవ్వకాలు, స్టాక్ యార్డుల నిర్వహణ, సరఫరా వంటి కీలక బాధ్యతలను ప్రయివేటు ఏజెన్సీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ బాధ్యతలను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉచిత ఇసుక విధానానికి సవరణల పేరిట రాష్ట్ర ప్రభుత్వం జిఓ.నెం.66తో మార్గదర్శకాలు విడుదల చేసిందని, దానిలో అంశాలు పరిశీలిస్తే ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవడానికి, ప్రైవేటుకు పెద్దపీట వేసేందుకే దీనిని తీసుకువచ్చినట్లు కనబడుతోందని తెలిపారు. ఇసుక రీచ్‌ల నిర్వహణ, తవ్వకాలు, స్టాక్‌యార్డు నిర్వహణ, సరఫరా వంటి బాధ్యతలను ప్రయివేటు వాళ్లకు అప్పగించి ప్రభుత్వం కేవలం ప్రేక్షక పాత్ర వహించేలా ఉండడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇప్పటికే పలుసార్లు ఇసుక విధానంలో మార్పు చేసినా సాక్షాత్తూ ముఖ్యమంత్రి బహిరంగంగా అధికార పార్టీ నాయకులను హెచ్చరించినా వినియోగదార్లకు ఇసుక లభ్యత, ధర విషయంలో ఎటువంటి ఉపశమనమూ లేదని పేర్కొన్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇసుక దందాలో ప్రధాన పాత్రదారులన్నది బహిరంగ రహస్యమని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తీసుకొచ్చిన సవరణలు సాధారణ వినియోగదారులకు ఏమాత్రమూ ఉపయోగపడకపోగా అధికార పార్టీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తోందని పేర్కొన్నారు. జిఓలో పేర్కొన్న జిల్లా స్థాయి ఇసుక కమిటీల పేరుతో ఉచిత ఇసుక నిర్వహణ, ధరల నిర్ణయం, నిఘా, నియంత్రణ మొదలగు ముఖ్యమైన విషయాలపై అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధుల పెత్తనం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వినియోగదారులే ఇసుక రీచ్‌లకు వెళ్లి తవ్వించుకొని, లోడ్ చేయించుకోవాలని, అలా చేయలేకపోతే ప్రయివేటు వారికి ఆపరేషన్ ఖర్చులు, నిర్వహణ ఛార్జీలతో పాటు ఇతర రుసుములు చెల్లించాలని స్పష్టం చేసిందని, దీనివలన పేరుకు మాత్రమే "ఉచిత ఇసుక" కానీ ఆచరణలో రకరకాల పేర్లతో వినియోగదారులు డబ్బు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉచిత ఇసుక పథకం నామమాత్రంగా మారే ప్రమాదం ఉందని, ప్రయివేటు ఏజెన్సీలకు కాకుండా ఇసుక సరఫరా చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని సూచించారు. నదులు, వాగుల సమీపంలో వినియోగదార్లు బండ్లు, ట్రాక్టర్లతో తమ సొంతానికి ఉచితంగా ఇసుక తీసుకువెళ్లే స్వేచ్ఛ కొనసాగించాలనీ, వారిపై ఎలాంటి వేధింపులూ లేకుండా చూడాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సరైన పత్రాల్లేకుంటే వెనక్కే!

వాషింగ్టన్ : తమ దేశంలో సరైన పత్రాల్లేకుండా నివసిస్తున్న భారతీయులను అమెరికా వెనక్కి పంపించేస్తోంది. ఒక అద్దె విమానంలో వీరిని తిరిగి పంపించేసినట్లు అమెరికా హోంల్యాండ్ భద్రతా విభాగం తెలిపింది. భారత ప్రభుత్వ సహకారంతోనే ఈ పని చేసినట్లు తెలిపింది. ఈనెల 22నే ఈ విమానం ఢిల్లీ చేరుకుందని వెల్లడించింది. ఎలాంటి చట్టబద్ధత లేకుండా అమెరికాలో కొనసాగే భారత జాతీయులను తక్షణమే పంపివేస్తామని హోం ల్యాండ్ భద్రతా డిప్యూటీ కార్యదర్శి (డిహెచ్‌ఎస్) బాధ్యతలు చూస్తున్న సీనియర్ అధికారి క్రిస్టీ కేన్‌గాలో తెలిపారు. 2024 ఆర్థిక సంవత్సరంలో 1,60,000 మంది దాకా ఇటువంటి వారు ఉన్నట్లు తేలిందని,145కి పైగా దేశాలకు చెందిన వీరిని 495 అంతర్జాతీయ విమానాల్లో వెనక్కి పంపించేస్తున్నామని క్రిస్టీ తెలిపారు. ఇందులో భారత్ కూడా వుంది. అక్రమ వలసలను తగ్గించేందుకు అమెరికా అనుసరించే మార్గాల్లో ఇదొకటి. గతేడాది కాలంలో కొలంబియా, ఈక్వెడార్, పెరూ, ఈజిప్ట్, మారిటానియా, సెనెగల్, ఉజ్బెకిస్తాన్, చైనా, భారత్‌లతో సహా పలు దేశాలకు ఇలా తరలింపులు జరిగాయి.

త్వరలో పేదలకు ఇంటిస్థలాలు

- టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమ ప్రారంభంలో చంద్రబాబు



సభ్యత్వ నమోదు యాప్‌ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్వరలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదగా తొలి సభ్యత్వం తీసుకొని ఈ కార్యక్రమాన్ని బాబు ప్రారంభించారు. అనంతరం పలువురు పార్టీ కార్యకర్తలతో జూమ్ యాప్ ద్వారా మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తామని చెప్పారు. టిడిపి రాజకీయ విశ్వవిద్యాలయమని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది నాయకులను తయారు చేసిన ఘనత ఉందన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన తాను ఇంతటి అస్తవ్యస్త పరిస్థితులు గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్రానికి రూ.10.50లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని చెప్పారు. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటేడ్(ఇఇఎస్‌ఎల్) ప్రతినిధులు తమకు రావాల్సిన నిధులు చెల్లించాలని శుక్రవారం తనను కలిశారని తెలిపారు. విధ్వంసం నుంచి గాడిలోపెట్టాలంటే సమయం పడుతోందన్నారు. రాజధాని అమరావతి పనులు డిసెంబర్ నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశను రెండేళ్లల్లో పూర్తిచేస్తామన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం కష్టపడుతున్నామని, సంక్షేమ, అభివృద్ధిని సమపాళ్ళలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే అనేక హామీలు నేరవేర్చామన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి చేస్తే ఆదాయం వస్తుందని, ఆదాయాన్ని సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తోందని, జనవరిలోపు రోడ్లపై గుంతల పూడ్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో మద్యం, ఇసుకలో రూపాయి అవినీతి లేకుండా అనుకున్న స్ఫూర్తిని చివరి వరకు తీసుకెళ్లే బాధ్యత తనదేనని వెల్లడించారు. వ్యక్తిగత అంశాలను పార్టీ కక్షలుగా తీర్చుకుంటామంటే సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యకర్తలు, నేతలపై పెట్టిన తప్పుడు కేసులను కూడా చట్టపరంగా పరిష్కరిస్తామని చెప్పారు. తన చుట్టూ కాకుండా ప్రజలు, కార్యకర్తలు చుట్టూ నేతలు తిరగాలని సూచించారు. పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందని అన్నారు. వర్ల రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, గుంటూరు ఎంపి లావు కృష్ణదేవరాయులు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ ప్రసంగించారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో మాట్లాడుతూ కంట తడిపెట్టిన షర్మిల

'నా బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు'

- విలేకరుల సమావేశంలో మాజీ సిఎం జగన్ సోదరి

5

తిరుపతిలో హోటళ్లకు బాంబు బెదిరింపు

3

ఎఐ వినియోగంతో రాష్ట్రాభివృద్ధి

- శాన్ ఫ్రాన్సిస్కో పారిశ్రామికవేత్తలతో లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల తేవాలనే లక్ష్యంతో ఆయన నవంబర్ ఒకటవ తేది వరకు అమెరికాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. తొలిరోజైన శనివారం శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశమైన లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకోబోతున్నాయని తెలిపారు. పరిపాలనలో ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషిచేస్తున్నట్లు చెప్పారు. విభజిత రాష్ట్రంలో మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి సరికొత్త పి-4 విధానానికి శ్రీకారం చుట్టారని అన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యతతో కూడిన మానవవనరులను అందిచండం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో సంస్కరణలు తెస్తున్నట్లు తెలిపారు. నవీన ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ రీసెర్చ్ సెంట్రిక్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పారిశ్రామికవేత్తలు ప్రవీణ్ అక్కిరాజు, రామ అక్కిరాజు, విప్రో ప్రెసిడెంట్ నాగేంద్ర బండారు తదితరులు పాల్గొన్నారు. అమెరికాకు చేరుకున్న లోకేష్‌కు అంతకుముందు అక్కడి తెలుగు ప్రముఖులు, టిడిపి అభిమానులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్ఆర్ఐ యుఎస్ఏ కోఆర్డినేటర్ జయరాం కోమటి తదితరులు ఉన్నారు.

ప్రజా ఉద్యమకారులపై రౌడీషీట్లు అన్యాయం

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

2

కార్పొరేట్ సంస్థలకు బిజెపి ఊడిగం

- చిత్తూరు జిల్లా సిపిఎం మహాసభలో రమాదేవి
- భారాలపై ప్రజలు ఉద్యమించాలని పిలుపు

2

జెన్‌కో, నెడ్‌క్యాప్‌లకు ఐఎస్ఒ గుర్తింపు

2

'అనంత'లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆరుగురు దుర్మరణం
- మృతులంతా 'ఇస్కాన్' సభ్యులు



లారీ కింద ఇరుక్కుపోయిన కారు

ప్రజాశక్తి- శింగనమల

అనంతపురం జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. వారంతా అనంతపురం ఇస్కాన్ ఆలయ సభ్యులు. పోలీసుల కథనం ప్రకారం... అనంతపురంలోని ఇస్కాన్ ఆలయ సభ్యులుగా సంతోష్ (34), షణ్ముఖ (21), వెంకటేష్ (20), శ్రీనివాసులు (34), ప్రసన్నకుమార్ రెడ్డి (29), ప్రణవ్‌సాయిరెడ్డి (14) ఉన్నారు. వీరు ఇస్కాన్ ఆలయంలో భక్తులుగా ఉంటూ సంకీర్తనలకు వివిధ ప్రాంతాల్లోని ఆలయాల కు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం అనంతపురం జిల్లా తాడిపత్రిలోని ఓ ఆలయంలో సంకీర్తనలకు వెళ్లారు. ఆ రోజు రాత్రి అక్కడే ఉన్నారు. శనివారం మధ్యాహ్నం కారులో తాడిపత్రి నుంచి అనంతపురం బయల్దేరారు. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద వీరి కారు టైర్ పేలింది. దీంతో, అదుపు తప్పి ఎదురుగా అనంతపురం నుంచి బియ్యం లోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది. లారీ, కారు వేగంగా ఎదురెదురుగా ఢీకొనడంతో కారులోని ఆరుగురూ అక్కడికక్కడే మరణించారు. లారీ కిందకు కారు దూసుకుపోవడం తో వారి మృతదేహాలు ఇరుక్కుపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ కింద ఇరుక్కుపోయిన కారును అతికష్టం మీద బయటకు తీశారు. కారు తలుపులను బలవంతంగా తెరవాల్సి వచ్చింది. అప్పటికే కారు లోని ఆరుగురూ తీవ్ర గాయాలతో మరణించారు. వారి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా మృతుల వివరాలను పోలీసులు తెలుసుకోగలిగారు. ఇస్కాన్ ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శింగనమల సిఐ కౌరుట్లయ్య తెలిపారు.

ఉక్కును ప్రయివేటీకరించే కుట్రలు మానుకోవాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



కేంద్ర ప్రభుత్వం ఉక్కు కార్మికులను కుదించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమని, తక్షణమే ప్లాంట్‌పై కుట్రలను విడనాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1353వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎల్ఎంఎం, డబ్ల్యుఆర్ఎం - 1, ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం, డబ్ల్యుఆర్ఎం - 2, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు, ఎఐటియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్ట్రాటజిక్ సేల్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అస్థిరపరిచేందుకు చూస్తోందని, పోరాటాల ద్వారా మోడీ సర్కారుకు కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు కార్మికుల హక్కులకు భంగం కలిగించే చర్యలను విడనాడాలని, లేనిపక్షంలో కార్మికాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం అనుసరిస్తోన్న విధానాలకు నిరసనగా ఈ నెల 28న ఉక్కు ప్రధాన పరిపాలనా భవనం వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎ.మసేన్‌రావు, జె.రామకృష్ణ, డి.దేముడు, ఎన్.మిశ్రా, సీతారామరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

'ఉక్కు'పై 1న విశాఖలో స్టూడెంట్ కన్వెన్షన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, అలాగే కడపలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర స్థాయి స్టూడెంట్ కన్వెన్షన్‌ను నవంబర్ ఒకటిన నిర్వహించనున్నారు. విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన ఉదయం పది గంటల నుంచి జరుగుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్‌జె నాయుడు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కన్వెన్షన్‌కు ద్రవిడ యూనివర్సిటీ మాజీ విసి కెఎస్ చలం, నాటి ఉక్కు ఉద్యమకారులు కొల్లా రాజమోహన్‌రావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్ నర్సింగరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్ ముఖ్య వక్తలుగా హాజరుకానున్నట్టు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్ఒ, ఎఐడిఎస్ఒ, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారని వెల్లడించారు. కన్వెన్షన్‌కు భారీ సంఖ్యలో విద్యార్థులు, యువతీ యువకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

4 వరకు పిడిపిఎంఎస్ పోర్టల్ సేవలు నిలిపివేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భవన నిర్మాణాలు, లే అవుట్ల ఆన్‌లైన్ అనుమతుల పోర్టర్‌లో ప్రభుత్వం మార్పులు చేయనుంది. ఈ నేపథ్యంలో నవంబరు 4వ తేదీ వరకు ఎపిడిపిఎంఎస్ పోర్టల్ సేవలు నిలిపివేస్తున్నట్లు పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్ విద్యుల్లత తెలిపారు. సర్వర్ డేటా బదలాయింపులో భాగంగా సేవలు నిలుపుదల చేయాల్సివస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో ఉన్న డేటాను స్టేట్ డేటా సెంటర్‌కు బదలాయిస్తున్నామన్నారు. వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత భవన, లే అవుట్లకు యధావిధిగా ఆన్‌లైన్‌లో అనుమతులిస్తామన్నారు. సేవలు నిలిపివేతను బిల్డర్లు, డెవలపర్స్, ఇంజనీర్లు గమనించాలని కోరారు.

జెన్‌కో, నెడ్‌క్యాప్‌లకు ఐఎస్ఒ గుర్తింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (ఎపిజెన్‌కో), ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) ప్రతిష్టాత్మక అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ పొందాయి. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఒ) ఆడిట్‌లో ఉత్తీర్ణత సాధించి ఐఎస్ఒ 9001 : 2015 ధ్రువీకరణను చేజిక్కించుకున్నాయి. ఈ విషయాన్ని జెన్‌కో, నెడ్‌క్యాప్ ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఐఎస్ఒ ఆడిట్ అధికారి ఆలపాటి శివయ్యతో కలిసి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనూ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితోనూ సమావేశమయ్యారు. ఐఎస్ఒ ధ్రువీకరణ సాధించడంలో జెన్‌కో, నెడ్‌క్యాప్ కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రి అభినందించారు.

కార్పొరేట్ సంస్థలకు బిజెపి ఊడిగం

- చిత్తూరు జిల్లా సిపిఎం మహాసభలో రమాదేవి
- భారాలపై ప్రజలు ఉద్యమించాలని పిలుపు
- దప్పులు, కోలాటాలతో ర్యాలీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ, దేశ ప్రజలకు ద్రోహం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. ప్రజలపై మోపుతున్న భారాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం చిత్తూరు జిల్లా 14వ మహాసభ శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జిల్లా కేంద్రమైన చిత్తూరులో ప్రారంభమైంది. తొలుత పురవీధుల్లో డప్పులు, కోలాటాలతో సిపిఎం శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. రైల్వేస్టేషన్ నుంచి డిఇఒ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. పేదలు, కార్మికులు, స్కీమ్ వర్కర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ముందు భాగాన సిపిఎం రాష్ట్ర నాయకులు డి.రమాదేవి, దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, నాయకులు సురేంద్రన్, ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా, బంగారుమురళి, భువనేశ్వరి, జ్యోతిరావు ఉన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద గంగరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రమాదేవి మాట్లాడుతూ.. ఢిల్లీ రైతు ఉద్యమం తరువాత పార్లమెంట్‌లో బిజెపి బలం తగ్గినా, ఇతర పార్టీలను కలుపుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న బిజెపి మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. బిజెపి



సిపిఎం 14వ చిత్తూరు జిల్లా మహాసభ ర్యాలీ

ఒంటెద్దు పోకడలకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పట్టుబట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి, నాలుగు నెలలు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా వంట గ్యాస్ పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రాన్ని మద్యం మత్తులో ముంచి, మహిళల ఉసురు పోసుకుంటోందన్నారు. ఉచిత ఇసుక పాలసీ పేదలకు భారంగా మారిందన్నారు. గత ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపిందని, ప్రజలు తిరగబడి ఆ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపారన్నారు. కొత్త ప్రభుత్వం వస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించిన పేదలకు నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వ విధానాలపై, భారాలపై ఎర్రజెండా నిరంతరం పోరాటం చేస్తూ, ప్రజల పక్షాన నిలిచిందని తెలిపారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లౌకిక దేశంలో చిచ్చుపెడుతూ అధికారాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టి, ప్రజలకు అనుకూలమైన ప్రభుత్వాలు వచ్చేలా ప్రజలు పోరాటాల్లో భాగస్వాములు కావాలని కోరారు. చిత్తూరు జిల్లాలో దళితులపై దాడులు జరిగినప్పుడు సిపిఎం అండగా నిలిచిందని తెలిపారు. దేశంలో ఉన్నతమైన రాజకీయాలను నడుపుతూ ప్రజలకు దిక్సూచిగా నిలిచిందన్నారు. ఈ మహాసభలో భవిష్యత్ పోరాటాలకు పదును పెడతామన్నారు. బహిరంగ సభలో సిపిఎం పూర్వ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమకారులపై రౌడీషీట్లు అన్యాయం

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా ఉద్యమకారులపై రౌడీషీట్లు పెట్టి వేధించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండించింది. తక్షణమే కేసులు ఎత్తేయాలని రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారం రోజులుగా కడప జిల్లా కాశినాయన మండలం పోలయ్య, శ్రీకాకుళం జిల్లాలో నాయకుడు సింహాచలాన్ని పోలీసులు వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమకారులను స్టేషన్లో పెట్టి అవమాన పర్చడం, రోజు వచ్చి స్టేషన్లో సంతకాలు పెట్టి వెళ్లాలని సాయంత్రం వరకూ స్టేషన్లోనే కూర్చోబెట్టడం చేస్తున్నారని తెలిపారు. పేదల కోసం, నిర్వాసితుల హక్కుల కోసం పోరాడితే గత ప్రభుత్వం రౌడీషీట్లు బనాయించిందని తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వేధించడం అత్యంత దుర్మార్గమని తెలిపారు. ఉద్యమకారులపై వెంటనే అక్రమ కేసులు ఎత్తివేయాలని, పోలీసుల వేధింపులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఐఎల్‌టిడి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావుకు నివాళి

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా చీరాలలోని ఐఎల్‌టిడి కంపెనీ వద్ద ఐఎల్‌టిడి ఎపి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావు సంతాప సభ శనివారం నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి పాఠాన్ కాలేషా అధ్యక్షతన జరిగిన సభలో వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎల్‌టిడి ఎపి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐటిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 50 ఏళ్ల సుదీర్ఘ జీవితాన్ని కార్మికుల అభ్యున్నతికి వెంకట్రావు అంకితం చేశారని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని తెలిపారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ వెంకట్రావు ఆశయ సాధనకు కార్మికులు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య, చీరాల కార్యదర్శి ఎం వసంతరావు, అధ్యక్షులు ఎన్ బాబురావు, కొండయ్య పాల్గొన్నారు.

సాగునీటి సాధనకు ఐక్య ఉద్యమం

- చర్చా వేదికలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో వాటి కోసం విశాల ఐక్య ఉద్యమాలు అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై మేధావులు, ప్రజా సంఘాల నాయకులతో చర్చా వేదిక కార్యక్రమం సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో శనివారం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాగునీటి నిపుణులు ఎస్.ఎం.బాషా మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా సాగునీటి వనరుల పరిరక్షణపై పాలకులకు ఏ మాత్రమూ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వీటిపై కదలిక రావాలంటే విశాల ఐక్య ఉద్యమాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. సంవృద్ధిగా నీటి వనరులు అందిస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ, హంద్రీనీవాను వెడల్పు వంటి పనులు చేపట్టాలన్నారు. వీటి కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని తెలిపారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్థిక మంత్రిగా ఉన్న పయ్యావుల కేశవ్‌కు ఇక్కడి సాగునీటి సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. కనీసం ఆయన నియోజకవర్గంలోనున్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసమైనా కృషి చేయాలని కోరారు. సామాజికవేత్త బోస్ మాట్లాడుతూ ప్రాజెక్టుల వారీగా కార్యక్రమాలను రూపొందించి, జనసమీకరణ కూడా ఆయా ప్రాజెక్టుల వారీగానే చేపట్టి కదలిక తీసుకురావాలని సూచించారు. మానవ హక్కుల వేదిక నాయకులు అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సాగునీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ప్రయత్నించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు సాగిన బస్సు యాత్ర వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా యాత్రలో గమనించిన అంశాలను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా కాలువలు ఏ రకంగా నిర్లక్ష్యం చేయబడ్డాయో యాత్రలో పరిశీలించిన అంశాలను తెలియజేశారు. అనంతరం తీర్మానాలు చేశారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణను తక్షణం చేపట్టి పూర్తి చేయాలి, తుంగభద్ర డ్యాం గేట్లను కొత్తవి ఏర్పాటు చేయాలి, హంద్రీనీవాను 6500 క్యూసెక్కుల ప్రవాహ సామర్యానికి పెంచాలి, ఉంతకల్లు జలాశయం పూర్తి చేయాలని, పిఎబిఆర్ కుడికాలువకు నీరివ్వాలి, సుబ్బరాయసాగర్‌కు నీటిని విడుదల చేయాలని పలు తీర్మానాలను ఆమోదించారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

టిడిఆర్ బాండ్లపై నిషేధాజ్ఞలు తొలగించండి

- బిల్డర్స్ అసోసియేషన్ నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో జరిగిన టిడిఆర్ బాండ్‌ల కుంభకోణాన్ని అడ్డుపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా వీటి వినియోగాన్ని నిలిపివేయడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బిల్డర్స్ అసోసియేషన్ తెలిపింది. అసోసియేషన్ నాయకులతో కలిసి ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్స్ తణుకు బాధితుల సంఘం అధ్యక్షుడు యాగంటి అవినాష్ శనివారం గుంటూరులోని ఒక హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. నిర్మాణ రంగంలో బిల్డర్లు అదనపు నిర్మాణానికి సంబంధించి గతంలో టిడిఆర్ బాండ్లు కొనుగోలు చేశారని తెలిపారు. తణుకు మున్సిపాలిటీకి చెందిన 800 టిడిఆర్ బాండ్లు అధికారికంగా ప్రభుత్వ పోర్ట్ నుండి బిల్డర్లు కొనుగోలు చేశారన్నారు.

గత ప్రభుత్వ హయంలో టిడిఆర్ బాండ్ల విషయంలో ఉల్లంఘనలు జరగడంతో వాటిపై నిషేధం విధించారని తెలిపారు. దీంతో టిడిఆర్ బాండ్లు కొనుగోలు చేసిన బిల్డర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బాండ్ల నిషేధంపై టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు తప్పు చేస్తే తమకు శిక్ష విధించడం సరికాదన్నారు. బాండ్లను రాష్ట్రంలో ఎక్కడైనా వినియోగించుకునే హక్కు బిల్డర్లకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 800 గృహ నిర్మాణ రంగ ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టిడిఆర్ బాండ్‌ల విషయంలో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. అసోసియేషన్ నాయకులు యోగేశ్వరరావు, ఎ.వి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ధన పిచ్చి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన పిచ్చి ఎక్కువ అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2004లో రూ.1.73 కోట్లుగా ఉన్న జగన్ ఆస్తులు ఇప్పుడు రూ.8 లక్షల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఈ ఆస్తులు ఎక్కడ నుంచి వచ్చాయని? ఇది ప్రజల సొమ్ము కాదా అని ప్రశ్నించారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని రూ.43వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అవినీతి మూలాలపై స్థాపించిన వైసిపి కూలిపోతుందన్నారు.

ఒకరిని రక్షించబోయి మరొకరు

- నీటి కుంటలో జారిపడి ఇద్దరు వలస కార్మికులు మృతి

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు వలస కార్మికులు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి శివారులో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నుండి బొల్లాపల్లికి కూలి పనులకు వలస వచ్చి పొలంలో నివాసం ఉంటున్న మన్నంగి ఉమా (18), మెల్లక జున్ని (18) సమీపంలోని నీటి కుంటలో స్నానం చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలు జారి ఉమా నీటిలో పడిపోయారు. ఆమెను రక్షించేందుకు జున్ని ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇద్దరూ నీటిలో మునిగి మతి చెందారు. బొల్లాపల్లి మండలం శివారు ప్రాంతంలో 80 ఎకరాలు భూమిలో విజయవాడకు చెందిన వ్యక్తి శ్రీ గంధం మొక్కలు సాగు చేస్తున్నారు. పొలంలో సంపు ఏర్పాటు చేసి దాని పక్కనే 7 అడుగుల లోతులో ఇంకుడు గుంతను తవ్వారు. ఈ పొలంలో ఒడిశా రాష్ట్రం నుండి 38 కుటుంబాల వారు వచ్చి పనిచేస్తున్నారు. ఇంకుడు గుంతలో వలస కార్మికుల కుటుంబాల మహిళలు బట్టలు ఉతకడం, స్నానం చేయడం వంటివి చేస్తున్నారు. రోజు లాగానే శనివారం ఉదయం నీటి కుంట వద్దకు వెళ్లి స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తు ఇద్దరు నీటిలో మునిగి మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరు యువతుల మతదేహాలను బయటకు తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన యువతులు

ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారం చెల్లించండి

- సిఎంకు వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి ఎసిసి కృష్ణా సిమెంటు ఫ్యాక్టరీ లాకౌట్ అయి 32 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు పరిహారం అందలేదని, దానిని వెంటనే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఆయన శనివారం లేఖ రాశారు. 1993 మే 29న ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీని అక్రమ లాకౌట్ చేశారని ఈ లేఖలో ఆయన తెలిపారు. అప్పట్లో చేసిన పనికి ఇప్పటికీ కార్మికులకు జీతాలు ఇవ్వలేదని పేర్కొన్నారుఏ. 333 మంది కార్మికుల్లో ఇప్పటి వరకూ 160 మంది చనిపోయారని, కార్మికుల కుటుంబాలు దీనావస్థలో ఉన్నాయని తెలిపారు. సిమెంటు కంపెనీ ఆస్తులను బాల భాను ఎంటర్‌ప్రైజెస్, ఎన్ఆర్ఐ నామినల్ రేట్లకు దక్కించుకున్నారని తెలిపారు. అదే సమయంలో బకాయిలు చెల్లించాలన్న వేలం కండిషన్‌ను ఇతవరకు అమలు చేయలేదని, దానిని అమలు చేయాలని కోరారు. గతంలో ఫ్యాక్టరీ భూములను పదికోట్లకు కొన్నారని, నేడు రెండువేల కోట్లకుపైగా విలువ చేస్తున్నాయని తెలిపారు. కార్మికులకు చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.43 కోట్లు ఇప్పటికీ చెల్లించలేదని వివరించారు. ఈ నియోజకర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు న్యాయం చేస్తానని హామీనిచ్చారని గుర్తుచేశారు. కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యను పరిష్కరించి, న్యాయం చేయాలని కోరారు. నష్టపరిహారం చెల్లించని పక్షంలో భూములను కార్మికుల పరం చేయాలని డిమాండు చేశారు. లేదావేలం పాడుకున్న కంపెనీ నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించండి

- సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానికి విరుద్ధంగా చార్జీలను 44 శాతం పెంచడాన్ని సిఐటియు రాష్ట్రకమిటీ ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, సిహెచ్.నరసింగరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారని. అధికారంలోకి వచ్చిన తరువాత భారీగా పెంచారని పేరొన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా అంతకుముందున్న టిడిపి ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల సర్దుబాటు విద్యుత్ ఛార్జీలను పెంచాల్సి వచ్చిందని చెప్పిందని, ఇప్పుడు టిడిపి ప్రభుత్వం తాను పెంచిన ఛార్జీలకు వైసిపి ప్రభుత్వం కారణమని చెబుతోందని తెలిపారు. ఈ రెండు ప్రభుత్వాలు ప్రైవేటు ఉత్పత్తిదారుల నుండి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నాయని వివరించారు. ప్రైవేటు పెట్టుబడులకు దాసోహం అవుతున్నారని, పీక్‌లోడ్ పేరుతో యూనిట్ సుమారు రూ.8 పెట్టి కొన్నారని తెలిపారు. ప్రపంచబ్యాంకు సిఫార్సులకు అనుగుణంగా విద్యుత్ ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో అధిక ధరలకు ప్రైవేటు విద్యుత్ కంపెనీల నుండి కొన్న విద్యుత్‌కుగాను సర్దుబాటు ఛార్జీల పేరుతో 2024 నవంబరు నుండి 2026 జనవరి వరకు యూనిట్‌కు రూ.0.83 పైసలు చొప్పున 15 నెలలపాటు వినియోగదారులు అదనంగా చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు కార్మికులు ఈ అదనపు భారాన్ని మోయలేరని, ప్రత్యేకించి అసంఘటిత కార్మికులు, నిరుద్యోగులపై ఈ భారం అత్యధికంగా ఉంటుందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ఎన్నికల్లో ఓడిపోయిందని, టిడిపి కూటమి ప్రభుత్వం దీని నుండి గుణపాఠం తీసుకుని వెంటనే పెంచిన ఛార్జీలను ఉపసంహరించాలని కోరారు. సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా పోరాడకపోతే 2024-25 ఆర్థిక సంవత్సరం సర్దుబాటు ఛార్జీలను 2026-27లో అదనంగా మోయాల్సి వస్తుందని హెచ్చరించారు.


ప్రజలపై ఛార్జీల భారాన్ని మోపొద్దు : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపవద్దని పిసిసి అధ్యక్షురాలు షర్మిల అన్నారు. విజయవాడ గాంధీభవన్‌లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఈ అంశంపై మాట్లాడిన ఆమె అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని, 30 శాతం తగ్గిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత 6 వేల కోట్ల రూపాయలను ట్రూ అప్ ఛార్జీల పేరిట భారం మోపడాన్ని ఆమె ఖండించారు. విద్యుత్ సంస్థలకు 40 శాతం విద్యుత్ ఛార్జీల పెంపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సరైన నిర్ణయం కాదన్నారు. ప్రభుత్వమే ఆ భారాన్ని మోపాలన్నారు. వైసిపి ప్రభుత్వం 60 వేల కోట్ల అప్పులు చేసిందంటున్నారు, ఆ ప్రభుత్వం పొరపాట్ల వల్లే మీరు అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు మీరు అదే తప్పులు చేయడమేనమిటన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

ప్రభుత్వమే భరిచాలి: కె.రామకృష్ణ

ప్రజలపై రూ.6,072 కోట్లు విద్యుత్ ఛార్జీల భారం వేసే నిర్ణయాన్ని విరమించుకుని, ప్రభుత్వమే ఆ భారాన్ని భరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోలు ఛార్జీల పేరుతో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8,114 కోట్లు సర్దుబాటుకు డిస్కంలు ప్రతిపాదించాయని, ఇందుకు అనుమతి ఇవ్వకపోతే 75 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరాయని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. దీనిపై ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయినప్పటికీ రూ.6,072 కోట్లు సర్దుబాటుకు కమిషన్ అనుమతి ఇచ్చిందన్నారు. గత ఎన్నికల్లో అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపమని, హామీ ఇచ్చిన టిడిపి ఇప్పు డు ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారం వేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాన్ని విస్మరించడమేనన్నారు.



శంకరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వి శ్రీనివాసరావు, వి కృష్ణయ్య, అంద్ర మాల్యాద్రి, తదితరులు

సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి శంకరరావు

- నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

స్థితివంతమైన కుటుంబంలో పుట్టినా పేదల కోసం కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి బొల్లు శంకరరావు పని చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పుడిలో గుండెపోటుతో మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు బొల్లు శంకరరావు భౌతికకాయాన్ని శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, అంద్ర మాల్యాద్రి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. శంకరరావు కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సిద్ధాంతపరమైన విలువలతో కూడిన మనిషి శంకరరావు అని అన్నారు. చివరి వరకూ అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. రైతులకు ఎరువులు, విత్తనాల విషయంలో చిలకలూరిపేటలో ఎంతో ధైర్యంగా ఉద్యమాలు నడిపారని, విత్తనాలు దొరక్క తొపులాట, ఆపై కాల్పులు జరగ్గా కాల్పుల్లో మరణించిన రైతులకు నష్టపరిహారం కోసం శంకరరావు పోరాడారని గుర్తు చేశారు. పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగకుండా పోరాడారన్నారు. శంకరరావు ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనిచ్చే నివాళి అని అన్నారు. అనంతరం నిర్వహించిన సంతాప సభకు సిపిఎం పట్టణ కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా వి.కృష్ణయ్య, ఇతర నాయకులు మాట్లాడారు. చిలకలూరిపేట, బొప్పూడిలో కమ్యూనిస్టు ఉద్యమంలో బొల్లు శంకరరావు కృషిని కొనియాడారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు. ఆయన పెద్ద కుమార్తె విజయ్ గౌతమి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సిపిఎం, ప్రజాసంఘాల శ్రేణులు, వివిధ పార్టీల వారు హాజరయ్యారు.

రేపు కెయులో స్పాట్ అడ్మిషన్లు

- బిటెక్, ఎంటెక్ పిజి కోర్సుల్లో ఖాళీల భర్తీ



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంఆర్ అండ్ సైన్స్ కాలేజీ, నూజివీడు ఎంఆర్ఏఆర్ కాలేజ్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్‌లో పిజి సీట్లతోపాటు కెయు ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్, ఎంటెక్ కోర్సుల్లో సీట్ల భర్తీకి ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎల్ సుశీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో ఉదయం 10 గంటల నుండి ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వెయ్యి రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పాల్గొనాలని సూచించారు. పిజి ర్యాంక్ కార్డుతోపాటు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాలని తెలిపారు. బిటెక్‌లో చేరే విద్యార్థులు ఎపిఈఏపి ర్యాంక్ తీసుకురావాలని కోరారు. ఎంఏ ఇంగ్లీష్, ఫిజిక్స్, గణిత శాస్త్రం, బయోటెక్నాలజీ, రసాయన శాస్త్రం, బోటనీ, జువాలజీ, ఎంకామ్ బిటెక్, ఎంటెక్, ఎంఎస్సి అప్లైడ్ కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, అప్లైడ్ గణిత శాస్త్రం విభాగాలలో సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు.



తిరుపతిలో హోటళ్లకు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి నగరంలోని పలు హోటళ్లకు బాంబు బెదిరింపు రావడంతో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు... తిరుపతి-తిరుమల మార్గంలోని కపిలతీర్థం సమీపంలో ఉన్న పై వైస్రాయ్, రాజ్‌పార్క్, లోటస్ హోటళ్లలో బాంబు పెట్టామని, మరి కొద్దిసేపట్లో అవి పేలతాయని గుర్తు తెలియని నెంబర్ నుంచి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు అందింది. అప్రమత్తమైన పోలీసులు ఉన్నతాధికారుల అనుమతితో సిఐ రామకిషోర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడ ఎలాంటి బాంబులు, విస్ఫోటం పదార్థాలు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బాంబు బెదిరింపు ఆకతాయిల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ దిశగా విచారణ చేపట్టారు.

ప్రజలకు రక్షిత నీరు అందించాలి

- డయేరియా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారమివ్వాలి
- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక డిమాండ్
- గుర్లలో బృందం పర్యటన

ప్రజాశక్తి-గుర్ల (విజయనగరం జిల్లా)

గ్రామ పంచాయతీలకు తగినన్ని నిధులు విడుదల చేసి ప్రజలకు రక్షిత తాగునీటిని అందించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియా ప్రబలి పలువురు మృత్యువాత పడిన నేపథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, ఆర్‌డబ్ల్యుఎస్ రిటైర్డ్ ఎస్ఇ, జెవివి నాయకులు కె.శివానంద కుమార్, ప్రజా ఆరోగ్యవేదిక జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణ రావు, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ హరీష్‌తో కలిసి ఆయన శనివారం ఆ గ్రామంలో పర్యటించారు. తొలుత ఎస్ఎస్ఆర్ పేట వద్దగల పంపు హౌస్‌ను, గ్రామాలకు తాగు నీరు వెళ్లే విధానం గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్షిత మంచి నీటి ట్యాంకును, కెల్ల జంక్షన్‌లో ఉన్న బోరువెల్‌ను పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో మాట్లాడి తాగునీటి సరఫరా, క్లోరినేషన్, నీటి తనిఖీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో అజశర్మ మాట్లాడుతూ.. గుర్లలో ఇటీవల సంభవించిన డయేరియా మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం దాపరిక వైఖరి అవలంభిస్తోందన్నారు. ఈ మరణాలకు కారణాలను మాత్రం వెల్లడించడంలేదని తెలిపారు. అధికారికంగా కేవలం ఒకే ఒక మరణం సంభవించిందని ప్రభుత్వం చెబుతోందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం డయేరియా మరణాలపై నియమించిన కమిటీ నివేదికను పూర్తిగా బహిర్గతం చేయలేదని అన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడమే తప్ప అసలు సమస్యకు కారణం కనుగొనడానికి మాత్రం ఉపయోగపడదని అన్నారు. కలుషిత నీరు, బహిరంగ మలవిసర్జన, నీటిలో వ్యర్థాలను వదలడం వంటివి కారణాలైతే దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. నదిలో నీటిని శుద్ధి చేయకుండా కేవలం క్లోరిన్ కలిపేసి సరఫరా చేయడం రక్షిత నీరు ఎలా అవుతుందని అన్నారు. ప్రజలకు రక్షిత మంచినీరు సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. చనిపోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, పూర్తిగా శుద్ధి చేసిన రక్షిత మంచి నీటిని ప్రభుత్వం సరఫరా చేయాలని, అపరిశుభ్ర నీటిని సరఫరా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, పంచాయతీలకు నిధులు విడుదల చేసి, ప్రజలకు రక్షిత తాగు నీరు సరఫరా అయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ రిటైర్డు ఎస్ఇ శివానంద కుమార్ మాట్లాడుతూ నీరు కలుషితం కావడానికి పారిశుధ్యమే కారణమని చెప్పి కిందస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకుంటే ఉపయోగం ఉండదని అన్నారు. నదీ జలాలను కలుషితం చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎస్ఎస్ఆర్ పేట వద్ద పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, ప్రజారోగ్యవేదిక నాయకులు

దాడికి కారకులైన వారిని అరెస్టు చేయాలి

- కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దళితులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలో కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై పదేపదే దాడులు దుర్మార్గాలు, దౌర్జన్యాలు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోవటం సరైంది కాదన్నారు. తమ భూములలో అక్రమంగా ఇసుక ఎందుకు తవ్వుతున్నారని ప్రశ్నించిన ఓ దళితుడిని ట్రాక్టర్‌తో గుద్దించి దాడికి పాల్పడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో శుక్రవారం జరిగిందని, చిత్తూరు జిల్లాలో తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్న భూమిని పెత్తందారులు ఆక్రమించుకుకోవడమే కాకుండా, బయట ప్రాంతాల నుంచి రౌడీలను పిలిపించి దళిత కుటుంబంపై దాడికి పాల్పడ్డ ఘటన విషయం రాష్ట్రంలో సంచలనం సృష్టించిందని తెలిపారు. వెంటనే దళితులపై దాడి చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించి దళితులకు తగిన న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఇందుకు పోలీసు యంత్రాంగం కూడా దళితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులలో దళితులకు రిలీఫ్ నిధులు విడుదల కాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకవైపు దాడులు మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో దళితులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాలపై ప్రభుత్వం సత్వరమే రాష్ట్రస్థాయిలో ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని కోరారు. జిల్లా స్థాయిలోనూ ఈ సమావేశాలు నిర్వహించి సమగ్ర నివేదిక తీసుకుని దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కెవిపిఎస్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, వి మోజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల్యాద్రి..

మావోయిస్టు నేత సంజయ్ దీపక్‌ను విచారించిన ఎన్ఐఎ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు సంజయ్ దీపక్‌రావును శనివారం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో నేషనల్ ఇంటిలిజన్స్ ఎజన్సీ (ఎన్ఐఎ) విచారించారు. గతేడాది సెప్టెంబర్ నెలలో హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేసి చర్లపల్లి జైలులో ఉంచిన సంగతి తెలిసిందే. అయితే ఒక పాత కేసులో విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో సంజయ్ దీపక్‌రావును పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో అధికారులు విచారించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 సంవత్సరంలో పిడుగురాళ్లలోని వీరమ్మ కాలనీకి చెందిన కంభంపాటి చైతన్య అనే యువకుడికి శిక్షణ ఇచ్చినట్లు ఆ శిక్షణ వల్ల చైతన్య మావోయిస్టుగా మారినట్లు పోలీసులకు పట్టుబడిన సమయంలో తెలపడంతో సంజయ్ దీపక్ రావుపై ఎన్ఐఎ అధికారులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చి తిరిగి తెలంగాణ రాష్ట్రం చర్లపల్లి జైలుకు తరలించారని పోలీసులు తెలిపారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులు ప్రత్యేక వాహనంలో సంజయ్ దీపక్ రావును కోర్టుకు తరలించేందుకు అప్రమత్తం చేస్తుండగా ప్రజాశక్తి దృష్టికి వచ్చింది. వివరాలు గురించి ఆరాతీయగా మావోయిస్ట్ కేంద్ర కమిటి సభ్యుడు సంజయ్ దీపక్ రావు అని తెలిసింది.

ఆఫీస్ ఆర్డర్ ప్రకారమే జీతాలు

- సమాచార హక్కు కమిషనర్ రిట్ పిటిషన్‌పై హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి -అమరావతి

రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సిఐసి) జారీ చేసిన ఆఫీస్ ఆర్డర్ ప్రకారమే జీతాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. సిఐసి జారీ చేసిన హాజరు ఉత్తర్వులు తనకు వర్తించవంటూ సమాచార హక్కు కమిషనర్ ఒకరు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ వడ్డిబోయిన సుజాత శనివారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సమాచార హక్కు కార్యాలయంలో సమాచార కమిషనర్లను జీతాల చెల్లింపుపై వివాదం నెలకొంది. దీనిపై సమాచార కమిషనర్లలో ఒకరైన చావలి సునీల్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన సమాచార కమిషనర్ జారీ చేసిన పాలనా ఉత్తర్వులు తనకు వర్తించవని, అందువల్ల ఆయన ఆదేశించిన విధంగా హాజరు విధానాన్ని తాను అనుసరించాల్సిన అవసరం లేదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ నెలనుండి తనకు రావాల్సిన జీతాలు చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాని ఆయన హైకోర్టును కోరారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ జీత భత్యాలను చెల్లించకుండా చీఫ్ కమిషనర్ నిలిపి వేశారని, అటువంటి హక్కు ఆయనకు లేదని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర సమాచార కమిషన్ తరపు న్యాయవాది పి. రవికాంత్ చీఫ్ కమిషనర్ జారీ చేసిన పాలనా ఉత్తర్వుల్లో కమిషనర్ల జీతాలు నిలిపివేయాలని ఎక్కడా లేదని హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్లు అటెండెన్స్ రిజిస్టర్లో సంతకాలు చేయడంతో పాటు, ముఖ గుర్తింపు విధానం పాటించాలని, వాటి ప్రాతిపదికనే జీతాల బిల్లును రూపొందించాలని మాత్రమే పాలనా ఉత్తర్వులో ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం చీఫ్ కమిషనర్ జారీ చేసిన ఆఫీస్ ఆర్డర్‌కు అనుగుణంగా విధులకు హాజరై ఉంటే సమాచార కమిషనర్ చావలి సునీల్‌కు ఈ ఏడాది సెప్టెంబర్ నెల నుంచి జీత, భత్యాలు చెల్లించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం, సమాచార కమిషన్ సెక్రటరీ, సమాచార ప్రధాన కమిషనర్‌లను ఆదేశాలు ఇచ్చారు. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేశారు. ఈలోగా ప్రభుత్వం, ఇతర ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు.

ఢిల్లీ బాటలో అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర అధికారులు వరుస ఢిల్లీ పర్యటనలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతులు, చర్చలకు కొంతమంది వెళ్తుండగా, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం మరికొంతమంది హస్తిన బాట పడుతున్నారు. గత నెల్లోనే కొంతమంది సీనియర్ ఐఎఎస్ అధికారులు ఢిల్లీకి వెళ్లగా, నవంబర్, డిసెంబర్ మాసాల్లో మరికొందరు వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధమౌతున్నాయి. రోడ్లు, నీటిపారుదల, విద్య, వైద్యం, తాగునీరు, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలతోపాటు ప్రత్యేకంగా రాజధాని నిర్మాణం, అమరావతిలో అభివృద్ధి, పోలవరం పనులకు భారీగా నిధులు కూడా కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పట్లో నేరుగా ఆ నిధులను భరించే శక్తి రాష్ట్ర ఖజానాకు లేకపోవడంతో కేంద్రం ఇచ్చే నిధులతోపాటు, రుణాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ కారణంగానే ఢిల్లీలో పలు శాఖల ఉన్నతాధికారులను కలిసి నిధులపై చర్చించాలని భావిస్తున్నట్లు తెలిసింది. కీలక శాఖలకు ముఖ్యమంత్రి కూడా ఇదే తరహా ఆదేశాలను ఇచ్చినట్లు సమాచారం.

చివరి ఆరు నెలలపైనే దృష్టి

ప్రస్తుతం మూడో త్రైమాసికం కొనసాగుతున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కేటాయింపులు మరింత ఎక్కువగా సాధించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే జనవరి నుంచి ప్రారంభమయ్యే చివరి త్రైమాసికంలో రావాల్సిన నిధులపైనా ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నామని, వీటిపైనా త్వరలో ఢిల్లీకి ఆయా శాఖల అధికారులు వెళ్లనున్నారని ఆయన చెప్పారు.ప్రత్యేకంగా ఆర్థికశాఖ అధికారులు కూడా నేరుగా కేంద్ర ఆర్థికశాఖ వద్దకు పలు దఫాలుగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు, పలు ప్రాజెక్టులకు నిధులపై వచ్చిన హామీలను త్వరగా సాధించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలని నిర్ణయించారు.

విశాఖ తీరంలో ఈస్ట్ కోస్ట్ రీసెర్చి సెంటర్

- నవంబర్‌లో రూ.28 కోట్లతో పనులకు శ్రీకారం
- సముద్ర జలాల పరిశోధనకు కొండపై లేబొరేటరీ నిర్మాణం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

సముద్ర పరిశోధనలకు అనువైన ఈస్ట్ కోస్ట్ రీసెర్చి సెంటర్ సిఎస్ఐఆర్-ఎన్ఐఒ ఆధ్వర్యాన విశాఖ-రుషికొండ సాగర తీరానికి అభిముఖంగా ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాణ ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. రాడిసన్ బ్లూ హోటల్ ఎదురుగా ఉండే కొండపై 3.25 ఎకరాల స్థలంలో ఈ రీసెర్చి సెంటర్ రాబోతుంది. కొండపైకి దిగువ నుంచి రోడ్డు నిర్మాణానికి జెసిబితో పనులు ఈ నెల 24న ప్రారంభమయ్యాయి. 1980వ దశకంలో ఈ స్థలాన్ని ప్రభుత్వం వద్ద నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషినోగ్రఫీ (ఎన్ఐఒ) సంస్థ రూ.50 లక్షలకు కొనుగోలు చేసింది. సుమారు రూ.28 కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణ పనులు చేపేట్టేందుకు, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ పర్యవేక్షణలో వాటిని నిర్వహించేందుకు సిఎస్ఐఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నవంబర్ మొదటి వారంలో పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దీనిలో భాగంగా కొండపై సముద్ర పరిశోధనలకు అవసరమైన లేబొరేటరీని నిర్మించనున్నారు.



రీసెర్చి లేబొరేటరీ ఏర్పాటు కానున్న కొండ ఇదే..

తీర ప్రాంత అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు అపార అవకాశాలు

అడ్వాన్స్‌డ్ సీ రీసెర్చికి ఈ లేబొరేటరీ దేశంలోనే కీలకంగా మారనున్నట్టు చెప్తున్నారు. తీర ప్రాంత పరిశ్రమల అభివృద్ధికి, ఐటి, మానుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీస్‌ను నెలకొల్పేందుకు, ఇతర సీ ప్రాసెసింగ్ ఫుడ్ పరిశ్రమలకు విస్తృత అవకాశాలు కల్పించేందుకు ఈ సెంటర్ దోహదపడనుందని ఎన్ఐఒకు చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో ఎన్ఐఒ ప్రధాన కార్యాలయం గోవాలో ఉండగా మూడు రీజనల్ కార్యాలయాలు ముంబయి, కొచ్చిన్, విశాఖపట్నంలలో ఉన్నాయి. పూర్తి స్థాయిలో విశాఖకు లేబొరేటరీ వస్తే 30 మంది శాస్త్రవేత్తలు అవసరం కానున్నారు.

సముద్ర జలాల్లో మార్పులు, కాలుష్య వ్యవహారాలపై పరిశోధన

విశాఖలో ఏర్పాటు కాబోయే ఈస్ట్ కోస్ట్ ఓషినోగ్రఫీ రీసెర్చి లేబొరేటరీ ప్రధానంగా సముద్ర నీటిలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయనుంది. దీనిలో భాగంగా నేరుగా లేబొరేటరీలోకి సముద్ర నీటిని పంపించేలా అండర్ గ్రౌండ్ వ్యవస్థ ద్వారా పంపింగ్ ఏర్పాట్లు చేయనున్నారు. ముఖ్యంగా సముద్రంలోకి అనేక రకాల వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్తా చెదారం చేరడంతో కాలుష్య కూపంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాలుష్య కారకాలపై ఈ లేబొరేటరీ పరీక్షలు చేపట్టి మార్పులను కేంద్రానికి నివేదిస్తుంది. ఏటా 1.5 మీటర్ల సముద్ర నీటిమట్టం కాలుష్య కారకాలతో పెరుగుతోందని తాజాగా ఆంధ్రా యూనివర్సిటీ వాతావరణ పరిశోధనా నిపుణుల అధ్యయనంలో తేలింది. వచ్చే 70 ఏళ్లలో తీర ప్రాంత నగరాలు సముద్రాల్లో కలసిపోబోతున్నాయన్న అంచనా నివేదికను కూడా రూపొందించారు. ఈ నూతన లేబరేటరీ రావడంతో తూర్పు కోస్తా పరిసరాల్లోని నీటినే కాకుండా బంగాళాఖాతం, అండమాన్ సముద్రం లోని నీటి కాలుష్య కారకాలపైనా శాస్త్రవేత్తలు అధ్యయనం చేయనున్నారని విశాఖపట్నానికి చెందిన ఎన్ఐఒ పూర్వ శాస్త్రవేత్త, డైరెక్టర్ ప్రభాకరమూర్తి 'ప్రజాశక్తి'కి తెలిపారు. వాస్తవానికి సీ వాటర్ అధ్యయనంపై శాస్త్రవేత్తల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని, ఎన్ఐఒ లేబరేటరీ విశాఖలో రాకతో 30 మంది అవసరం పడతారని చెప్పారు.

వారసత్వ ఆస్తి హక్కుల్లో కుమార్తెలకు అన్యాయం

- సన్‌ఫీస్ట్ సర్వేలో వెల్లడి



హైదరాబాద్ : భారత్‌లో కుమారులతో సమానంగా కుమార్తెలు వారసత్వ ఆస్తి హక్కులో వాటాలను పొందలేకపోతున్నారని సన్‌ఫీస్ట్ సర్వేలో వెల్లడయ్యింది. కూతుళ్లు కూడా వారసత్వ ఆస్తిని పొందేందుకు సమాన హక్కులు ఉన్నప్పటికీ, వాస్తవానికి ఇది సత్య దూరంగానే ఉంటుందని వెల్లడయ్యింది. కేవలం ఏడు శాతం కుమార్తెలు మాత్రమే వీలునామా ద్వారా సమాన వారసత్వాన్ని పొందుతున్నారని తమ అధ్యయనంలో తేలిందని ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ ప్రతినిధి అలీ హారిస్షేరీ తెలిపారు. భారత్‌లో చాలా మంది కూతుళ్లు తమ వారసత్వ ఆస్తి దగ్గరకు వచ్చేసరికి తమ తల్లిదండ్రుల నుంచి అన్యాయమైన ప్రవర్తనను ఎదుర్కొంటున్నారన్నారు. 'విల్ ఆఫ్ చేంజ్' ప్రచారం ద్వారా కుమార్తెలకు సమాన వారసత్వ హక్కుల మార్పును తీసుకురావటానికి తల్లులను ప్రేరేపించగలమని తాము విశ్వస్తున్నామన్నారు.

పిజ్జా హట్‌తో ఐటిసి భాగస్వామ్యం

హైదరాబాద్: ఆహార పరిశ్రమలో దిగ్గజాలు, పిజ్జా హట్, ఐటిసి కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా పిజ్జా హట్ తమ మెనూలో అత్యధికంగా అమ్ముడవుతున్న సన్‌ఫీస్ట్ పానీయాలు డార్క్ ఫాంటసీ మిల్క్‌షేక్, మ్యాంగోస్మూతీని జోడించనున్నట్లు పేర్కొంది. నాణ్యత ఆవిష్కరణలపై భాగస్వామ్య దష్టితో, ఈ భాగస్వామ్యం అన్ని విభాగాలలో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు తగినట్లుగా మెరుగైన అనుభవాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుందని ఐటిసి ఫుడ్స్ డైరీ అండ్ బెవరేజెస్ హెడ్ వివేక్ కూక్కల్, పిజ్జా హట్ డైరెక్టర్ రోహన్ పెవేకర్ తెలిపారు.

క్రిప్టో కరెన్సీలతో ముప్పు

- ఆర్థిక వ్యవస్థలకు ప్రమాదం
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత వెల్లడి



న్యూఢిల్లీ : క్రిప్టో కరెన్సీలతో ఆర్థిక వ్యవస్థల స్థిరత్వానికి భారీ ముప్పు పొంచి ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ మరోమారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిజిటల్ కరెన్సీలతో సెంట్రల్ బ్యాంక్ నగదు చలామణిపై నియంత్రణ కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. పీటర్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ అనే థింక్ ట్యాంక్ కార్యక్రమంలో గవర్నర్ శక్తికాంత మాట్లాడుతూ.. 'ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం ప్రదర్శించే క్రిప్టో కరెన్సీలను అనుమతించవద్దు. క్రిప్టో కరెన్సీలతో ఆర్థిక సుస్థిరతకు ముప్పు. ద్రవ్య లభ్యత ప్రమాదం పొంచి ఉంటుంది. బ్యాంకింగ్ వ్యవస్థ కూడా ముప్పులో పడుతుంది. ఆర్థిక వ్యవస్థలో నగదు చెలామణిపై ఆర్‌బిఐ నియంత్రణ కోల్పోతుంది." అని శక్తికాంత అన్నారు. క్రిప్టోకరెన్సీల వల్ల కలిగే నష్టాల గురించి ప్రభుత్వాలు కూడా తెలుసుకుంటున్నాయని శక్తికాంత పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థపైన క్రిప్టోల ఆధిపత్యం ఉండకూడదన్నారు. ఈ కరెన్సీ వల్ల కలిగే నష్టాలను గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సమస్య మీద అందరికి అవగాహన ఉండాలన్నారు. క్రిప్టోకరెన్సీల గురించి భారత దేశమే తొలి సారి ప్రశ్నించిందన్నారు.

"భారత్‌లో జరిగిన జి20 సమావేశంలో క్రిప్టో అంశం మీద అవగాహన పెంపొందించడానికి ఒక ఒప్పందం జరిగింది. అప్పట్లో దీనిపైన తీవ్రమైన ఆందోళనలను వ్యక్తం చేసిన మొదటి సెంట్రల్ బ్యాంక్ ఆర్‌బిఐనే. ఈ విషయంలో ఇప్పటికే కొంత పురోగతి సాధించాము. దీనిపై ఇంకా పనిచేయాల్సి ఉంది. క్రిప్టోల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది." అని అన్నారు. క్రిప్టోతో కలిగే భారీ నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యపై అంతర్జాతీయంగా అవగాహన పెరగాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లకు ఇది ప్రధాన ఆందోళనగా మారిందన్నారు.

బంగారం అమ్మకాలు తగ్గొచ్చు..

- అధిక ధరల ఎఫెక్ట్

న్యూఢిల్లీ : బంగారం ధరలు ఆకాశాన్ని అంటడంతో ఈ ఏడాది దీపావళి పండగ సీజన్‌లో అమ్మకాలు పడిపోవచ్చని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతేడాది ఇదే సమయంతో పోల్చితే 15-20 శాతం వరకు విక్రయాలు, డిమాండ్ క్షీణించవచ్చని అభరణాల వర్తకులు ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుతం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం రూ.80వేల ఎగువన పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. సాధారణంగా దీపావళి, ధన్‌తేరాస్ సమయంలో దేశంలో అనేక మంది బంగారం కొనుగోళ్లకు శుభప్రదంగా భావిస్తారు. వినియోగదారులను ఆకర్షించడానికి అనేక అభరణాల విక్రయ సంస్థలు విద్యుత్ కార్లు, ఐఫోన్లు, ప్రతీ కొనుగోలుపై బంగారం నాణేలు, వెండి నాణేలు తదితర ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. అయినప్పటికీ పెద్ద డిమాండ్ లేదని తెలుస్తోంది. "బంగారం ధర నిరంతరం పెరుగుతోంది. హెచ్చు ధరలు వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ ధరతో బంగారం డిమాండ్ 15-20 శాతం మేర క్షీణించవచ్చు." అని సెన్‌కో గోల్డ్ అండ్ డైమాండ్ ఎండి, సిఇఒ సువంకర్ సేన్ పేర్కొన్నారు.

యెస్ బ్యాంక్ లాభాల్లో 147 శాతం వృద్ధి

ముంబయి : ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ లాభాలు రెట్టింపు పైగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 147.8 శాతం వృద్ధితో రూ.566.59 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.228.64 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమ యంలో రూ.7,980 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో 15.6 శాతం వృద్ధితో రికార్డ్ స్థాయిలో రూ.9225.45 కోట్లకు చేరింది. నికర అడ్వాన్సులు 12.4 శాతం వృద్ధితో రూ.2,35,117 కోట్లకు చేరగా.. డిపాజిట్లు 18.3 శాతం పెరిగి రూ.2,77,214 కోట్లుగా నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 0.9 శాతం నుంచి 0.5 శాతానికి తగ్గాయి.

రూ.699కే జియో 4జి ఫోన్

న్యూఢిల్లీ : దీపావళి ధమాకా ఆఫర్ కింద రూ.699కే జియో 4జి ఫోన్‌ను అందిస్తున్నట్లు రిలయన్స్ జియో తెలిపింది. దీని వాస్తవ ధర రూ.999 అని తెలిపింది. తగ్గింపు ధర కేవలం కొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపింది.. 2జి ఫీచర్ ఫోన్స్ నుంచి అప్‌గ్రేడ్ అవ్వాలనుకునే వారికి ఇదొక గొప్ప అవకాశమని పేర్కొంది. దీనికి నెలవారి రూ.123 రీచార్జ్ చేయాల్సి ఉంటుందని తెలిపింది.

నిఫ్టీ 27,867కు చేరొచ్చు : పిఎల్ కాపిటల్

ముంబయి : వచ్చే నెలల్లో ఎన్ఎస్ఇ నిఫ్టీ 27,867 స్థాయికి చేరొచ్చని పిఎల్ కాపిటల్ ప్రభుదాస్ లీలాధర్ అంచనా వేసింది. రాబోయే పండుగ, వివాహ సీజన్‌లలో మార్కెట్, స్ట్రీట్ అంచనాలు ఇప్పటికే బలమైన డిమాండ్‌ను పుంజుకున్నాయని అయితే డిమాండ్‌లో ఏదైనా నిరాశ ఉంటే ఇపిఎస్ అంచనాలు మరింత దిగజారడానికి దారితీయవచ్చని పిఎల్ క్యాపిటల్ పేర్కొంది.

సంపాదకీయం


బాధ్యతా రాహిత్యం!

బాధ్యత అంటే– ఎవరు చెప్పినా చెప్పకపోయినా మన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించడం. 'బాధ్యతలకు... మానసిక సుఖానికి చుక్కెదురు' అంటాడో రచయిత. వ్యక్తిగత స్వార్థాన్ని పక్కనపెట్టి ఒక పనిని తన భుజస్కంధాల మీద ఎత్తుకోవడం బాధ్యత. కుటుంబంలో తల్లిదండ్రులు బాధ్యతతో వ్యవహరించినట్లే... తమ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులూ బాధ్యతతో మెలుగుతారు. ఇది అనాదిగా వస్తోన్న ఒక సంప్రదాయం. అలాగే, ప్రజల పట్ల బాధ్యత కలిగి వుండటం పాలకుల కర్తవ్యం. ప్రజలు సమాజం పట్ల తమ బాధ్యతను గుర్తెరిగేలా చైతన్యపర్చడం కూడా పాలకుల విధి. 'మనం ఏ పార్టీలకు చెందిన వాళ్ళమయినా, మనందరం ఉన్నత స్థాయిలో గౌరవ మర్యాదలనూ, యుక్తాయుక్త వివేచనను కాపాడుకోవడం ఎంతైనా ముఖ్యం. విమర్శ కేవలం విధానాలకు, కార్యక్రమాలకు సంబంధించి మాత్రమే జరగాలి. ఏ దశలోనూ, ఏ రూపంలోనూ అది వ్యక్తిగత విమర్శగా, వ్యక్తిగత దూషణగా దిగజారిపోకూడదు. మనం రూపొందించుకున్న ప్రమాణాలు ఆదర్శంగా వుండాలి' అంటారు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. నేటి రాజకీయాలలో వ్యక్తిగత దూషణలు ఒక స్థాయిని మించిపోయాయంటే అతిశయోక్తి కాదు. కానీ, మాట్లాడే మాటకు, నిర్వర్తించే ఆచరణకు పొంతన లేనితనం, బాధ్యతా రాహిత్యం సర్వసాధారణం అయిపోయింది.

ఇటీవల రాష్ట్రంలో డయేరియాతో ప్రజలు వాంతులు, విరేచనాలతో అనారోగ్యం పాలయి, కొన్ని మరణాలు కూడా సంభవించాయి. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా ఘటనకు సంబంధించి... 'ఇక్కడ డయేరియా తీవ్రం కావడానికి బహిరంగ మలవిసర్జనే కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు' అంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్వయంగా సెలవిచ్చారు. అంతేకాదు... 'ప్రజలకు కూడా ఈ విషయంలో బాధ్యత వుందని, వారు బహిరంగ మలవిసర్జన వంటి అలవాట్లను మానుకోవాలని' కోరారు. దాచేపల్లిలో డయేరియా వల్ల ఇద్దరు మృతి చెందారని అధికారులు చెప్తుంటే, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి మాత్రం... ఒకరు కూల్ డ్రింక్ తాగడంతో అది వికటించి మరణించాడని, మరొకతను కిడ్నీ సమస్యతో చనిపోయాడని చెపుతున్నారు. 'రోజూ కాలేజీకి వెళ్లే తమ కుమారుడికి అనారోగ్యం ఏమీ లేదని, వాంతులు, విరేచనాలతో చనిపోతే, కూల్ డ్రింక్ తాగి చనిపోయాడని మంత్రి సత్యకుమార్ చెప్పడం దారుణం' అని మృతుని తల్లిదండ్రులు వాపోతున్నారు. అప్పుల బాధతో రైతులు బలవన్మరణాలకు పాల్పడినప్పుడు... మానసిక సమస్యల వల్లే ఇవి జరుగుతున్నాయని, పరిహారం కోసమే అలా చేస్తున్నారని అన్నదాతలను కించబరిచేలా వ్యాఖ్యానాలు చేసిన దాఖలాలూ వున్నాయి. నిరుద్యోగం, ఆకలి, పేదరికం, రక్తహీనత ఈ దేశ బాలబాలికలను, యువతీ యువకులను మృత్యుముఖంలోకి నెడుతున్న దుస్థితిని ఇటీవల వచ్చిన అనేక నివేదికలు తేటతెల్లం చేశాయి.

నీటి కాలుష్యం వల్ల వ్యాపించిన డయేరియాకు బహిరంగ మలవిసర్జనే కారణమని, అందుకే డయేరియా వ్యాపించిందని బాధ్యతాయుత పదవిలో వున్నవారే చెపుతున్నారు. ఈ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఈ అలవాటు కొనసాగుతోంది. ఇది ఈనాటిది కాదు. అయితే, దీన్ని నివారించాల్సిన బాధ్యత ఎవరిది? 'గ్రామాలు అభివృద్ధి చెందితే, దేశం అభివృద్ధి చెందుతుంది' అని గాంధీజీ అన్నారు. మరి ఆ గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది కాదా? ప్రజలకు కూడా బాధ్యత వుందని చెబుతున్న ఉపముఖ్యమంత్రి గారు... తమ బాధ్యతను మాత్రం విస్మరించారు. కూల్‌డ్రింక్ వల్లే మృతి చెందాడని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రే చెప్పడం పలాయనవాదంకాక మరేమిటి? 'అధికారాన్ని చేపట్టదలచినవాడు బాధ్యతలను కూడా నెత్తిన వేసుకుతీరాలి' అంటాడు తెన్నేటిసూరి చెంఘిజ్ ఖాన్ నవలలో. సమస్య ఎందుకొచ్చింది? దాన్నెలా పరిష్కరించాలి అన్న కోణంలో కాకుండా, ఆ సమస్యను గత ప్రభుత్వంపైకో, బాధితులపైకో నెట్టేయడం ద్వారా సమస్యను తప్పుదోవ పట్టించే వైఖరి తీసుకుంటున్నారు. 'సమస్యను పరిష్కరించలేకున్నా మనమంతా సమస్యలో భాగమే' అంటాడో రచయిత. ప్రజలకు రక్షణగా వుంటామని సవాలక్ష హామీలు, వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి' అన్న ధోరణిలో వ్యవహరించడం శోచనీయం. బాధితులకు భరోసాగా నిలవాల్సిందిపోయి వారిపైనే నిందలు వేయడం బాధ్యతాయుతమైన స్థానాల్లో వున్న వారికి తగునా?

మహనీయుల మాట



ఏ అభిప్రాయాన్ని అయినా
తిరస్కరించే హక్కు
ప్రతి ఒక్కరికీ ఉంది.
కానీ దాని వ్యక్తీకరణను
నిరోధించే హక్కు ఎవరికీ లేదు.

- పెరియార్ ఇ.వి. రామస్వామి,
నాస్తికవాది, సంఘసంస్కర్త.

కొత్త సిజెఐ ఆగమన వేళ...సవాళ్లలో న్యాయ వ్యవస్థ...

ప్రస్తుతం

భారత దేశ నూతన ప్రధాన న్యాయమూర్తి (సి.జె.ఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నాను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. సి.జె.ఐ డి.జె. చంద్రచూడ్ నవంబరు 10వ తేదీన దిగిపోనుండగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆ మరుసటి రోజు బాధ్యతలు స్వీకరిస్తారు. ఆరు మాసాలు పదవిలో వుండి 2025 మే 13న రిటైర్ అవుతారు. సుప్రీంకోర్టుకు న్యాయమూర్తుల నియామకాలు, ప్రధాన న్యాయమూర్తి ఎంపికలు నిరంతర ప్రక్రియే అయినా ఎప్పటికప్పుడు కొత్త కోణాలు, విమర్శలు, ఆరోపణలు, అంచనాలు సాగుతుంటాయి.



తెలకపల్లి రవి

రాజ్యాంగ రక్షణ కీలక కర్తవ్యంగా మారిన ప్రస్తుత సందర్భంలో సుప్రీం కోర్టు పాత్ర న్యాయమూర్తుల నేపథ్యం కూడా కీలకంగా తయారైంది. 2024 ఎన్నికల్లో బిజెపి స్వంతంగా మెజార్టీ తెచ్చుకోలేకపోవడానికి రాజ్యాంగంపై దాడి ఒక కారణమనేది నిస్సందేహం. సంపూర్ణమైన ఆధిక్యత లేదంటే అంతకు మించిన సంఖ్యాబలం కలిగిన ఏకపార్టీ ప్రభుత్వాలున్నప్పుడు న్యాయ వ్యవస్థ ఒకింత ఆలోచించి అడుగు వేస్తుందనేది ఇన్నేళ్ల అనుభవం. నిబద్ధ న్యాయ వ్యవస్థ గురించి కూడా ఎమర్జన్సీలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మాట్లాడేవారు. అనేక కోణాల్లో అత్యవసర పరిస్థితిని మించిన మోడీ పాలనలోనూ అదే పరిస్థితి చాలాసార్లు ప్రత్యక్షమైంది. మాజీ న్యాయమంత్రి కీర్తిశేషులు అరుణ్ జైట్లీ విస్తృత ప్రజా మద్దతుగల ప్రభుత్వాలను న్యాయస్థానాలు ఆదేశించడం ఏమిటని ఒక దశలో ప్రశ్నించారు కూడా. ఉప రాష్ట్రపతి జగదీప్ ధంకర్ రోజూ అదే చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాలలోనూ వేర్వేరు ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు తమ తమ అనుకూలతలను బట్టి కోర్టులపై వ్యాఖ్యలు చేయడం తెలిసిన విషయమే. మోడీ హయాంలో రాఫెల్ కుంభకోణం వంటివి కూడా కోర్టులలో తేలిపోయాయి. అయోధ్య తీర్పు, శబరిమల వివాదం, 370 అధికరణం కాశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి, పౌరసత్వ సవరణ చట్టం, ఇ.వి.ఎం లు, ఎన్నికల బాండ్లు ఇంకా అనేక అంశాల్లో అత్యున్నత న్యాయస్థానం తీరు అసంతృప్తి మిగిల్చింది. రాజకీయ నేతలు, మీడియా ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ఆఖరుకు ముఖ్యమంత్రుల వంటి వారిపై కేసులలోనూ కోర్టులు భిన్న ప్రమాణాలు పాటించడం ప్రశ్నార్థకమైంది. మాజీ సి.జె.ఐ లు, ఇతర న్యాయమూర్తులు కూడా



రాజ్యాంగ పరంగా స్వతంత్ర ప్రతిపత్తి, జవాబుదారీతనం కలిగి వుండాల్సిన న్యాయ వ్యవస్థను ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ఉపయోగించు కోవాలనుకోవడం అప్రజాస్వామికం. ఈ కాలంలో కొందరు న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు, మతతత్వ వ్యాఖ్యలు కూడా పెద్ద సవాలుగా మారాయి. తీర్పుల ఆలస్యం, అవినీతి పెద్ద సమస్యలుగా వున్నాయని జస్టిస్ గవాయ్ ఈ మధ్యనే వ్యాఖ్యానించారు. అయితే ఆ విషయంలో జరగాల్సిన పోరాటం చాలా వుంది. 'ఒకే దేశం ఒకే ఎన్నిక'తో సహా రాజ్యాంగ మౌలిక స్వభావాన్నే సవాలు చేసే నిర్ణయాలు, మతతత్వ నిరంకుశ పోకడలు పెచ్చరిల్లుతున్న సమయంలో న్యాయ వ్యవస్థ సమగ్ర ప్రక్షాళన కూడా ప్రాధాన్యత సంతరించుకుంటున్నది.

విమర్శలను బేఖాతరు చేసి పదవులలో పునరావాసం పొందారు. బలమైన కార్యనిర్వాహక వర్గం (ఎగ్జిక్యూటివ్) వుంటే న్యాయ వ్యవస్థ గట్టి వైఖరి తీసుకోవడానికి కాస్త తటపటాయిస్తుందని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అన్నారు.

చంద్రచూడ్ టు సంజీవ్ ఖన్నా

గత కొన్నేళ్లలోనూ అత్యధిక కాలం దాదాపు రెండేళ్లు పదవిలో వుంటున్న సిజెఐగా చంద్రచూడ్ హయాంలో ఎన్నికల బాండ్లపై వెలువడిన తీర్పు ప్రత్యేకించి చెప్పుకోదగింది. ఎస్.సి వర్గీకరణ, పారిశ్రామిక ఆల్కహాల్‌పై పన్ను, గనులపై రాష్ట్రాల పన్ను హక్కు వంటి విషయాల్లో చివరి ఘట్టంలో తీర్పులిచ్చిన చంద్రచూడ్ ముందు ఇంకా రెండు మూడు కీలక కేసులున్నాయి. ఏమైనా స్వలింగ వివాహాల వంటి సామాజికాంశాల్లో సంచలన తీర్పులకు ఆధ్వర్యం వహించినా రాజకీయ రాజ్యాంగ అంశాల్లో మిశ్రమ వ్యాఖ్యలే మూట కట్టుకున్నారు. ప్రత్యక్ష ప్రసారాలు విస్తృతం చేయడం, సుప్రీం కోర్టులో డిజిటల్ సదుపాయాలతో వార్ రూం ఏర్పాటు చేయడం సి.జె.ఐ చంద్రచూడ్ విజయాలుగా ప్రచారమవుతున్నాయి. హైకోర్టు న్యాయమూర్తుల తీరును తప్పు పట్టడం, సుప్రీం కోర్టులో పలుసార్లు అడ్వకేట్ల తీరుపై ఆగ్రహించడం కూడా చూశాం. సంచలనం సృష్టించిన తిరుపతి లడ్డూ కేసు ధర్మాసనంలో ఆయన లేరుగానీ కోర్టు ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం ఈ కాలంలో జరిగిందే. మరీ ముఖ్యంగా అయోధ్య రామ మందిరానికి అధికారికంగా కాషాయ వస్త్రాల్లో వెళ్లి అదేపనిగా పొగిడి రావడం, తాజాగా వినాయక చవితి వేడుకలకు ప్రధాని మోడీని ఆహ్వానించడం ఆయనను విమర్శలకు గురి చేసింది. మళ్లీ ఇటీవల అయోధ్య తీర్పుకు ముందు దైవ సన్నిధిలో కూర్చున్నట్టు చెప్పడం కూడా వార్తలకూ వ్యాఖ్యలకు కారణమైంది. ఏమైనా తనపైన చరిత్ర ఎలాటి తీర్పునిస్తుందో తెలియదని సి.జె.ఐ భూటాన్ పర్యటనలో స్వయంగా సందేహం వెలిబుచ్చడం విశేషం. తన స్థానంలో నూతన సి.జె.ఐ గా సంజీవ్ ఖన్నా పేరు సిఫార్సు చేయడానికి కూడా ఆయన రెండు మూడు రోజులు అధిక సమయం తీసుకున్నట్టు ఈలోగా కొలీజియంలో కొన్ని నియామకాల సిఫార్సులను ఆమోదింప చేసుకోవడానికి ప్రయత్నాలు చేశారని కూడా కథనాలు వచ్చాయి.

జస్టిస్ సంజీవ్ ఖన్నా తొలుత ఢిల్లీ తీస్ హజారీ కోర్టులలో వివిధ రకాల ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించారు. 2019 జనవరిలో ఢిల్లీ హైకోర్టు నుంచి నేరుగా సుప్రీం కోర్టుకు నియామకం పొందిన ఆయన చాలా మంది సీనియర్లను అధిగమించి అత్యున్నత కోర్టుకు వచ్చారు. ఈ తరహాలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులైన వారు పది మంది కూడా వుండరని చెబుతున్నారు. ఢిల్లీ హైకోర్టులో ప్రదీప్ నంద్ర జోగ్, రాజేంద్ర మీనన్‌లు ఖన్నా కన్నా సీనియర్లు. అయినా వారిని కాదని ఖన్నాను ఎంపిక చేయడంలో ఒక కారణం వుందని న్యాయ వర్గాలు విమర్శ చేశాయి. సీనియార్టీ ప్రకారం సి.జె.ఐ ల సిఫార్సు జరుగుతుంది గనక ఆయన ఆరు నెలలకు మించి వుండరు. అదే వారిని నియమిస్తే కేంద్రం అనుకున్న ప్రకారం తదుపరి సి.జె.ఐ ల నియామకం కుదరదు. ఇప్పుడు సి.జె.ఐ గా సంజీవ్ ఖన్నా 2025 మే 13న పదవీ విరమణ చేస్తే తర్వాత జస్టిస్ గవాయ్ ఆ స్థానంలోకి వచ్చి మరో ఆరు నెలలు వుంటారు. ఆపైన జస్టిస్ సూర్యకాంత్ సి.జె.ఐ కావడమే గాక 15 నెలలు వుంటారు. ఈ సమయం కీలకమైందని కేంద్రం భావిస్తున్నట్టు సమాచారం.

వివాదాస్పద న్యాయమూర్తులు

జస్టిస్ చలమేశ్వర్ తదితరులు సంచలనంగా మీడియాతో మాట్లాడినప్పుడు న్యాయ వ్యవస్థలో వస్తున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ప్రమాణాలు పడిపోవడం, సీనియారిటీ పాటించకపోవడం వంటి అనేక ఉదాహరణలు ఇచ్చారు. ఆ సమయంలో సి.జె.ఐ గా వున్న దీపక్ మిశ్రా సీల్డ్ కవర్ సంస్కృతికి పేరుగాంచారు. కేంద్రానికి సంబంధించిన ప్రతి కేసులోనూ సీల్డు కవర్‌లో సమాచారం అడగడం, ఏదో విధంగా తీర్పు చెప్పి ముగించడం అప్పట్లో పరిపాటిగా వుండేది. అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కలిఖో పుల్ ఆత్మహత్య సందర్భంగా ఆరోపణలు ఎదుర్కొన్న జస్టిస్ ఖేర్‌పై వచ్చిన పిటిషన్‌ను సీనియర్లను కాదని జూనియర్ జడ్జికి అప్పగించడం, అలాగే అమిత్‌షా పై ఆరోపణలు విచారించిన జస్టిస్ లోయా మృతిపై కేసును తగు ప్రాధాన్యతతో విచారించకపోవడం వారి ఆగ్రహానికి తక్షణ కారణమైంది. అనూహ్యంగా వారితో పాటు ఆ మీడియా గోష్టికి హాజరైన జస్టిస్ రంజన్ గొగోయ్ తర్వాత సి.జె.ఐ పదవి చేపట్టి అందరికన్నా వివాదాస్పద పాత్ర పోషించారు.ఇదే ఎన్నికల బాండ్ల కేసు వచ్చినపుడు త్వరగా విచారించేందుకు గానీ, స్టే ఇవ్వడానికి గానీ ఒప్పుకోలేదు. బాండ్ల ద్వారా విరాళాలు వచ్చిన పార్టీలు ఆ వివరాలు తెలియజేయాలని మాత్రమే మొక్కుబడి ఆదేశాలిచ్చి 2019 ఎన్నికలలో బిజెపి అత్యధిక విరాళాలు పొందడానికి ద్వారాలు తెరిచారు. తనపై కోర్టు సిబ్బందిలోని ఒక మహిళ లైంగికపరమైన ఆరోపణలు చేసినప్పుడు విచారించే ధర్మాసనంలో తానే కూర్చోవడం సి.జె.ఐ రంజన్ గొగోయ్ అనౌచిత్యాలకు పరాకాష్టగా నిలిచింది తన కేసులో తనే జడ్జి కారాదు అనే సూత్రానికి ఇది పూర్తి విరుద్ధం. ఆ సమయంలో ఆ ధర్మాసనంలో కూర్చున్న వారిలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ అరుణ్ మిశ్రా వున్నారు. రంజన్ గొగోయ్ పదవీ విరమణ తర్వాత కనీస విరామం (కూలింగ్ పీరియడ్) కూడా లేకుండానే రాజ్యసభకు నామినేట్ కావడం, అక్కడ రాజ్యాంగ మౌలిక స్వభావం తీర్పునకు వ్యతిరేకంగా మాట్లాడ్డం దీనికి కొనసాగింపే! గొగోయ్ హయాంలో అనేక కీలక కేసుల విచారణలో జస్టిస్ అరుణ్ మిశ్రా తప్పక వుండేవారు. మోడీని బాహాటంగా పొగిడి తరించి విమర్శలు మూటకట్టుకున్న జస్టిస్ మిశ్రా పూర్వాశ్రమంలో జస్టిస్ లోయా మృతి కేసు విచారణను బాహాటంగా నీరుగార్చారన్న ఆరోపణలకూ గురైన వ్యక్తి. ఆయన పేరు మూడు సార్లు కొలీజియం కాదన్నా చివరకు ఆపలేకపోయింది. ఎస్‌సి, ఎస్‌టి చట్టం స్ఫూర్తికి వ్యతిరేకంగా ఒక తీర్పునిచ్చిన చరిత్ర ఆయనదే. కోరి నియమించుకున్న వారి కథ ఒకటైతే అడ్డుకున్న వ్యవహారాలు మరెన్నో. ఒరిస్సా హైకోర్టు జస్టిస్ మురళీధర్ ఉదంతం వాటిలో ఒకటి మాత్రమే. జడ్జిలుగా నియమించేవారి పుట్టిన రోజుల వివరాల నుంచి వారిలో ఎవరితో ముందు ఎవరితో తర్వాత ప్రమాణం చేయించాలనేది లెక్క కట్టి మరీ జరుగుతుంటాయి.

సమగ్ర ప్రక్షాళన?

కొంతమంది వీటికి కొలీజియం కారణమని చెబుతూ న్యాయ వ్యవస్థ నియామకాలు కేంద్రం చేతుల్లో పెట్టాలని వాదిస్తారు. కొలీజియం పద్ధతి లోపాలున్నా కేంద్రానికే అధికారాలు ఇవ్వడం కూడా సరైంది కాదు. మోడీ సర్కారు కూడా ఏకపక్షంగా న్యాయ నిమాయకాల కమిషన్ (ఎన్‌జాక్) బిల్లు తెచ్చి భంగపడింది. వాస్తవానికి సమగ్రమైన న్యాయ వ్యవహారాల కమిషన్ అవసరమని సిపిఎం సభ్యుడు బి.ఆర్. భట్టాచార్య తెచ్చిన బిల్లు చర్చకే నోచలేదు. న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం, చట్టసభలు, బార్ ప్రాతినిధ్యంతో దాన్ని ఏర్పాటు చేయాలని ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికలోనూ సూచించింది. ఇందుకు భిన్నంగా మోడీ సర్కారు తనకు లోబడి వుండే న్యాయ వ్యవస్థ కోరుకుంటోంది. ప్రస్తుతం సి.జె.ఐ కాబోతున్న సంజీవ్ ఖన్నా మేనమామ మాజీ సి.జె.ఐ హెచ్.ఆర్.ఖన్నా ఎమర్జన్సీలోనూ ధైర్యంగా నిలబడటమే గాక పదవికి కూడా రాజీనామా చేశారు. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి జైల్‌సింగ్‌పై ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగానూ పోటీ చేశారు. జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్, చిన్నపరెడ్డి వంటి వారు ఆ విషయంలో చెప్పుకోదగిన పాత్ర నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ విధమైన స్వతంత్ర స్ఫూర్తిని ఊహించగలమా? అనేక వివాదాలకు అవకాశమిచ్చిన మాజీ సి.జె.ఐ ఖేర్ వుండగా ఒకసారి మోడీ 'ఎవరి పరిధిలో వారుండాలి' అని వ్యాఖ్యానిస్తే 'మా హద్దులు మాకు తెలుసు' అని ఆయన వినయంగా ప్రతిస్పందించారు. రాజ్యాంగ పరంగా స్వతంత్ర ప్రతిపత్తి, జవాబుదారీతనం కలిగి వుండాల్సిన న్యాయ వ్యవస్థను ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ఉపయోగించు కోవాలనుకోవడం అప్రజాస్వామికం. ఈ కాలంలో కొందరు న్యాయ మూర్తులపై అవినీతి ఆరోపణలు, మతతత్వ వ్యాఖ్యలు కూడా పెద్ద సవాలుగా మారాయి. తీర్పుల ఆలస్యం, అవినీతి పెద్ద సమస్యలుగా వున్నాయని జస్టిస్ గవాయ్ ఈ మధ్యనే వ్యాఖ్యానించారు. అయితే ఆ విషయంలో జరగాల్సిన పోరాటం చాలా వుంది. 'ఒకే దేశం ఒకే ఎన్నిక'తో సహా రాజ్యాంగ మౌలిక స్వభావాన్నే సవాలు చేసే నిర్ణయాలు, మతతత్వ నిరంకుశ పోకడలు పెచ్చరిల్లుతున్న సమయంలో న్యాయ వ్యవస్థ సమగ్ర ప్రక్షాళన కూడా ప్రాధాన్యత సంతరించుకుంటున్నది.

2019 జనవరిలో ఢిల్లీ హైకోర్టు నుంచి నేరుగా సుప్రీం కోర్టుకు నియామకం పొందిన ఆయన చాలా మంది సీనియర్లను అధిగమించి అత్యున్నత కోర్టుకు వచ్చారు. ఈ తరహాలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులైన వారు పది మంది కూడా వుండరని చెబుతున్నారు. ఢిల్లీ హైకోర్టులో ప్రదీప్ నంద్ర జోగ్, రాజేంద్ర మీనన్‌లు ఖన్నా కన్నా సీనియర్లు. అయినా వారిని కాదని ఖన్నాను ఎంపిక చేయడంలో ఒక కారణం వుందని న్యాయ వర్గాలు విమర్శ చేశాయి. సీనియార్టీ ప్రకారం సి.జె.ఐ ల సిఫార్సు జరుగుతుంది గనక ఆయన ఆరు నెలలకు మించి వుండరు. అదే వారిని నియమిస్తే కేంద్రం అనుకున్న ప్రకారం తదుపరి సి.జె.ఐ ల నియామకం కుదరదు. ఇప్పుడు సి.జె.ఐ గా సంజీవ్ ఖన్నా 2025 మే 13న పదవీ విరమణ చేస్తే తర్వాత జస్టిస్ గవాయ్ ఆ స్థానంలోకి వచ్చి మరో ఆరు నెలలు వుంటారు. ఆపైన జస్టిస్ సూర్యకాంత్ సి.జె.ఐ కావడమే గాక 15 నెలలు వుంటారు. ఈ సమయం కీలకమైందని కేంద్రం భావిస్తున్నట్టు సమాచారం.

సెటైర్

భం..భం..అఘోరా!

వాణి చాలా కంగారుగా ఆఫీసుకు తయారవుతున్న మురళి దగ్గరకు వెళ్ళింది. "ఏమండీ! నానిగాడు కనబడటం లేదు! స్కూలుకి టైమ్ అవుతోంది! ఎక్కడికి వెళ్ళాడు?" అడిగింది.

"స్కూలుకి డుమ్మా కొట్టాలని ప్లాన్ వేసుంటాడు! నేను పట్టుకొస్తానుండు" అంటూ మురళి ఇల్లంతా చూశాడు. ఎక్కడా కనబడలేదు. నానిగాడు ఆడుకునే చోట్లలో, దాక్కునే చోట్లలో అంతటా వెతికారు. కానీ లాభం లేదు.

ఇంతలో ఇంటి గేటు ముందు అలికిడైంది. వాణి, మురళి ఆదుర్దాగా బయటికొచ్చి చూశారు! మీడియా వ్యాన్లు ఒకటి తర్వాత మరొకటి వస్తున్నాయి! వాటితో మనకేమిటి అనుకొని ఇంట్లోకి వచ్చి మళ్లీ నానిగాడిని వెతకటం మొదలెట్టారు. కానీ మీడియా కార్లన్నీ వాళ్లింటి ముందే ఆగాయి! భార్యాభర్తలు ఆశ్చర్యపోయి చూస్తుండగా అన్ని ఛానళ్ల వాళ్లు వచ్చి, కెమెరాలు సెట్ చేసుకుంటున్నారు.

"మా ఇంటికి ఎందుకొచ్చారు?" అన్నాడు మురళి గొంతు పెగల్చుకుని.

"మీ ఇంట్లో అఘోరీ బాబా ఉన్నాడంట! మాకు సమాచారం వచ్చింది" అన్నారొకరు.

"అదిగో అఘోరి బాబా వచ్చాడు...! అని ఎవరో అంటుండగానే మురళి ఇంట్లోంచి ఒక అఘోరి వచ్చాడు. అతనికి పదేళ్లుంటాయి. ఒళ్లంతా బూడిద పూసుకుని ఉన్నాడు. మెడ నుండి మోకాళ్ల దాకా పెద్ద పెద్ద రుద్రాక్షలతో చేసిన మాలలు వేసుకున్నాడు. నుదిటన మొత్తం ఎర్రటి కుంకుమ దిద్దుకున్నాడు. ఒక చేతిలో జపమాల, మరో చేతిలో త్రిశూలం పట్టుకున్నాడు. కెమెరాల ముందుకు వచ్చి నిలుచున్నాడు. అఘోరిని చూడగానే కెమెరామెన్లు, యాంకర్లు సాగిలబడి దండాలు పెట్టారు. మురళి, వాణి కూడా భక్తితో నమస్కరించారు. కానీ వారికంతా గందరగోళంగా ఉంది. వున్నట్టుండి ఈ అఘోరి తమ ఇంట్లోంచి ఎలా ఊడిపడ్డాడో అర్థంకాలేదు.

"అయ్యో...మా నానిగాడు, అఘోరీ అయ్యాడా!" ఏడుస్తూ అడిగారు మురళి, వాణి. "ఇంకా అఘోరి అవ్వలేదు! కాని కావాలన్న కోర్కె బలంగా ఏర్పడింది! మీరు ఇంట్లో సనాతన ధర్మం బోధించటం వల్ల, ఇంకా ఈ ఛానళ్లు అఘోరీలను స్టార్లలాగా చూపటం వల్ల, పెద్దయ్యాక డాక్టరో, సైంటిస్టో అయ్యి భవిష్యత్‌లో మనుషుల ప్రాణాలు కాపాడాల్సిన వాడికి, మనుషుల్నే పీక్కుతినే అఘోరీ కావాలనే కోర్కె కలిగింది. దానికి మీరంతా బాధ్యులే!



"ఏమండీ ఈ అఘోరి మనింటికి ఎప్పుడొచ్చాడు!" భర్త చెవిలో గొణిగింది వాణి.

"ఏమో నాకేంతెలుసు? ముందు దండం పెట్టుకో! అఘోరికి కోపం వస్తే అంతమైపోతాం!" అన్నాడు మురళి భయంగా చెతులెత్తి మొక్కుతూ.

ఇంక యాంకర్ల ప్రశ్నల పరంపర మొదలైంది. అన్ని ఛానెళ్లు లైవ్ పెట్టాయి.

"స్వామి ఎక్కడి నుండి వచ్చారు!" యాంకర్ ప్రశ్న

"శ్మశానం నుండి!" అఘోరీ జవాబు

"మీ పేరు ఏమిటి స్వామీ?" యాంకర్ ప్రశ్న

"భం! భం! అఘోరా!" అఘోరీ జవాబు.

"ఈ పట్టణంలో ఎన్నో పెద్ద గుళ్లు, బిల్డింగులూ ఉండగా మీరు ఈ ఇంటికి ఎందుకు వచ్చారు స్వామీ?" వాణి, మురళి అడిగారు.

"సనాతన ధర్మమును కాపాడటానికి!"

"సనాతన ధర్మానికి తామేం ద్రోహం చేశామో భార్యాభర్తలకు అర్థం కాలేదు. పైగా నానిగాడికి రోజూ సనాతన ధర్మం గొప్పతనం గురించి చెబుతూనే ఉన్నాం గదా!" అనుకున్నారు.

"ఇప్పుడు ఉప ముఖ్యముంత్రులు, ముఖ్యమంత్రులు మొదలుకొని ప్రధానమంత్రి వరకూ నిరంతరం సనాతన ధర్మాన్ని కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు! ఇప్పుడు...బుల్లి అఘోరీ కూడా వచ్చాడు. సనాతన ధర్మాన్ని కాపాడటానికి ఏం చేయాలో సెలవివ్వండి స్వామీ!" అన్నాడొక యాంకర్ కడు భక్తితో.

"మీరంతా అఘోరీలుగా మారండి! అపుడే సనాతన ధర్మం నిలబడుతుంది!" అన్నాడు.

అందరూ అదిరిపడి చూస్తుండగా "స్వామీ మీకు బోలెడు శక్తులు ఉంటాయి గదా! పొద్దుటి నుండీ మా నానిగాడు కనబడటం లేదు! ఎక్కడున్నాడో అంజనం వేయండి స్వామీ!" అంటూ అఘోరి ముందు మోకరిల్లారు మురళీ, వాణి!

"ఈ అఘోరీనే మీ నానిగాడు" అన్న మాటలు వెనక నుండి విన్పించాయి.

మురళి, వాణి ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూశారు. నానిగాడి స్కూలు టీచర్ లక్ష్మి కన్పించారు. ఆవిడను చూడగానే అఘోరి అలియాస్ నానిగాడు త్రిశూలం కింద పడేసి ఒంటికున్న బూడిద తుడుచుకుంటూ ఇంట్లోకి దౌడుతీశాడు. అఘోరి అలియాస్ నానిగాడు ఇంట్లోకి పరుగు పెట్టగానే లైవ్ ఆపేసి కెమెరాలు తీసేశారు.

"అప్పుడు కాదు! ఇపుడు పెట్టండి లైవ్! ఐదేళ్ల కుర్రవాడు ఒంటికి బూడిద పూసుకుని వస్తే అఘోరి అయిపోతాడా? అఘోరీకి ఇంత పబ్లిసిటీ ఇస్తారా? ఇంతగా సాగిలపడి మొక్కటానికి సిగ్గుగా లేదా? అఘోరీలు మనిషి మాంసం తింటుంటే గొప్పగా చూపిస్తారా? మనిషి మాంసం తినే అఘోరీలు గొప్పవారు అయినపుడు...మాంసాహారం తినేవారు సనాతన ధర్మాన్ని చెడగొట్టే వారు ఎందుకవుతారు? మనిషి మాంసం తినేవాడు నాగరికత తెలియని వాడు! కాని అదేదో మహోన్నత విషయం అన్నట్టు, ఆచరించదగ్గదీ అన్నట్టు చూపుతారా?" తీవ్రంగా ప్రశ్నించింది లక్ష్మి టీచర్.

"అయ్యో...మా నానిగాడు, అఘోరీ అయ్యాడా!" ఏడుస్తూ అడిగారు మురళి, వాణి.

"ఇంకా అఘోరి అవ్వలేదు! కాని కావాలన్న కోర్కె బలంగా ఏర్పడింది! మీరు ఇంట్లో సనాతన ధర్మం బోధించటం వల్ల, ఇంకా ఈ ఛానళ్లు అఘోరీలను స్టార్లలాగా చూపటం వల్ల, పెద్దయ్యాక డాక్టరో, సైంటిస్టో అయ్యి భవిష్యత్‌లో మనుషుల ప్రాణాలు కాపాడాల్సిన వాడికి, మనుషుల్నే పీక్కుతినే అఘోరీ కావాలనే కోర్కె కలిగింది. దానికి మీరంతా బాధ్యులే! ఇప్పటికైనా మీరంతా బాధ్యతతో మెలగండి!" అన్నారు లక్ష్మీ టీచర్.

- ఉషాకిరణ్

జనవాక్యం

తారా స్థాయికి ధరలు

నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు దిగి రావడంలేదు. వరుస పండుగలతో అవి మరింత పెరిగి....సామాన్య, మధ్యతరగతి వర్గాలపై ఆర్థిక భారం మోపుతున్నాయి. ఈ ధరలకు అనుగుణంగా వారం సరిపడా కూరగాయలు, నిత్యావసరాల కొనుగోలుకు ఒక కుటుంబానికి దాదాపు వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు ఖర్చువుతున్నట్లు మధ్యతరగతి వారు వాపోతున్నారు. నెలలో నాలుగు వారాలకు గాను కూరగాయలు, నిత్యావసరాలకే దాదాపు ఏడెనిమిది వేల రూపాయల ఖర్చువుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది పేద, మధ్యతరగతి వర్గాలపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపుతుంది. వేతనాలతో బాడుగ ఇళ్లలో జీవిస్తున్న ప్రైవేటు ఉద్యోగులు, ఈ కూరగాయలను కొనుగోలు చేయడం భారంగా మారింది. ఈ ధరలు పెరుగుదలతో రోజువారీ కూలీలు, సామాన్యులు రైతు బజార్లుకు వెళ్లి అరకొరగానే కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ధరల అదుపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయాలి.

– దాసం వెంకటరెడ్డి, ఉరదాళ్లపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా.

పచ్చదనం-పరిశుభ్రత

అధిక వర్షాలకు తోడు చెత్త పేరుకుపోయి, రాష్ట్రవ్యాప్తంగా అపరిశుభ్రతతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రైన్లు, వాగులు, వంకలు, చివరకు నదుల్లోకి కూడా వ్యర్థ పదార్థాలు చేరుకుని మురుగు నీరు పారక... డయేరియా వంటి వ్యాధులతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంతా పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. పురపాలక సంఘాల్లో మూలనపడిన చెత్త తరలింపు వాహనాలకు మరమ్మతులు చేయించి డంపింగ్ యార్డులకు తరలించాలి. అలాగే డ్రెయిన్లలోకి, పంటకాలవల్లోకి, నదుల్లోకి వ్యర్థ పదార్థాలను వేయకుండా కట్టడి చేయాలి. తాగునీటి చెరువులు, ఫిల్టర్ బెడ్లు, ట్యాంకులలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ జరిగేలా చూడాలి.

– గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ వ్యాసాలను
పంపాల్సిన మెయిల్: editpageps @ gmail.com

'హిందీ లేఖ అర్థం కాలేదు'..

- కేంద్ర మంత్రికి డిఎంకె ఎంపీ తమిళంలో లేఖ

చెన్నై : పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు ఆంగ్లంలో కాని, తమిళంలో కాని సమాధానం పంపించకుండా, హిందీలో పంపించడం పట్ల డిఎంకె ఎంపి అభ్యంతరం తెలిపారు. డిఎంకె రాజ్యసభ ఎంపీ పుదుక్కోట్టై ఎంఎం అబ్దుల్లా, రైళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతకు సంబంధించిన ప్రశ్న అడిగారు. రైల్వే సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ దీనికి హిందీలో సమాధానం పంపారు. రైల్వే శాఖ సహాయ మంత్రి కార్యాలయం నుంచి అందే లేఖలు ఎప్పుడూ హిందీలో ఉంటాయి. ఆయన కార్యాలయం అధికారులకు నేను ఫోన్ చేశా. నాకు హిందీ రాదని, దయచేసి లేఖను ఆంగ్లంలో పంపాలని కోరా. అయినప్పటికీ లేఖ హిందీలో ఉంది. అందుకే కేంద్ర మంత్రి అర్థం చేసుకుని వ్యవహరించడం కోసం తమిళంలో ప్రత్యుత్తరం పంపా' అని పేర్కొన్నారు.

కేజ్రీవాల్ హత్యకు కుట్ర

- ఆయనకు ఏం జరిగినా బిజెపిదే బాధ్యత : ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అంతమొందించేందుకు కుట్ర జరుగుతోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించింది. పశ్చిమ ఢిల్లీలోని వికాస్‌పురిలో పాదయాత్ర నిర్వహిస్తున్న కేజ్రీవాల్‌పై దాడిని ప్రస్తావిస్తూ దీని వెనుక బిజెపి హస్తమున్నదని ఆప్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్‌కు ఏం జరిగినా బిజెపియే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కేజ్రీవాల్‌పై బిజెపి గూండాలు దాడి చేశారని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ ఘటనలో పోలీసుల ప్రమేయాన్ని చూస్తుంటే కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు తీవ్రమైన కుట్రే జరిగిందని స్పష్టమవుతోందని ఆయన చెప్పారు. కేజ్రీవాల్ జీవితానికి బిజెపి శత్రువుగా మారిందని విమర్శించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఉంటే దాడి ఘటన జరిగి ఉండేది కాదని, దాడికి పాల్పడిన దుండగులు బిజెపి యువజన విభాగానికి చెందిన వారని తమకు తెలిసిందని అన్నారు. ఘటనపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని విలేకరులు ప్రశ్నించగా, దర్యాప్తు జరపాల్సిన బాధ్యత పోలీసులదేనని సంజయ్ సింగ్ చెప్పారు.

మహారాష్ట్రలో ఎంవిఎకు ఆప్ ప్రచారం

- జార్ఖండ్‌లో జెఎంఎంకు మద్దతు

న్యూఢిల్లీ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నిర్ణయించింది. మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) తరపున ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేయనున్నారు. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యుబిటి), శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి – ఎస్‌పి, కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) తరపున కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని ఆప్ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్ నేతృత్వంలోని అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) తరపున కూడా కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని చెప్పారు.

బెంగాల్‌లో మరో ఇద్దరు మృతి

- దానా తుపానుతో తీవ్రనష్టం

పశ్చిమ బెంగాల్ : దానా తుపాను కారణంగా పశ్చిమ బెంగాల్‌లో మరో ఇద్దరు మరణించారు. దీంతో చనిపోయిన వారి సంఖ్య నాలుగుకు చేరుకుందని అధికారులు శనివారం తెలిపారు. పుర్బా బర్ధమాన్ జిల్లాలోని బడ్‌లో అదే ప్రాంతానికి చెందిన చందన్ దాస్ (31) విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. పోలీసు బృందంతో బయటకు వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగిందని అధికారులు తెలిపారు. హౌరా మునిసిపల్ కార్పొరేషన్‌కి చెందిన ఒక ఉద్యోగి మృతదేహం తాంతిపరాలోని నీటి ప్రవాహంలో ఉన్న రోడ్డులో కనిపించింది. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. విద్యుదాఘాతం కారణంగా శుక్రవారం దక్షిణ 24 పరగణాల జిల్లా పథర్‌ప్రతిమలో ఒకరు, దక్షిణ కోల్‌కతాలోని భబానీపూర్ ప్రాంతంలో మరొకరు మరణించారని అధికారులు తెలిపారు. దాను తుపాను బీభత్సంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మౌలిక సదుపాయాలు, పంటలకు గణనీయమైన నష్టం జరిగింది.

బాంబు బెదిరింపులపై సోషల్‌మీడియాకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ : విమానయాన సంస్థలకు ఇటీవల కాలంలో బాంబు బెదిరింపులు పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి బెదిరింపుల వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది. నిబంధనలను అతిక్రమించినట్లయితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కేంద్రం ఆదేశాలను పాటించకపోతే థర్డ్ పార్టీ కంటెంట్‌ను ఆయా ప్లాట్‌ఫామ్‌లు తీసుకునే వెసులుబాటును నిలిపివేస్తామని పేర్కొంది. వివిధ ఎయిర్‌లైన్స్‌లకు ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్, వాటి వల్ల నిలిచిపోయిన, ఆలస్యమైన విమాన సర్వీసులు, ఇతర కార్యకలాపాలను కేంద్రం ఈ సందర్భంగా ప్రస్తావించింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

ఉపాధి హామీకి కేంద్రం తూట్లు

- ఆరు నెలల్లో 84.8 లక్షల మంది తొలగింపు
- తగ్గిన వ్యక్తిగత పనిదినాలు
- ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థతో మరిన్ని సమస్యలు
- లిబ్‌టెక్ నివేదిక వెల్లడి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూనే ఉంది. ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఎబిపిఎస్), ఫేస్ ఆథెంటిఫికేషన్ హాజరు వంటి కొత్త పద్ధతులను తీసుకొచ్చి, పేదలను ఉపాధి హామీ నుంచి తొలగిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) నుండి 84.84 లక్షల మంది కార్మికుల జాబ్ కార్డులు తొలగించారు. ఇది గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దిగజార్చింది. తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, అస్సాం, బీహార్‌లలో అత్యధిక సంఖ్యలో తొలగింపులు జరిగాయి. దేశంలో ఉపాధి హామీ అమలుపై విద్యావేత్తలు, కార్యకర్తలతో కూడిన లిబ్‌టెక్ నివేదిక నమోదైన 24.6 కోట్ల మంది కార్మికుల్లో 84.84 లక్షల మంది కార్మికుల జాబ్ కార్డులు ఆరు నెలల్లో తొలగించినట్లు స్పష్టం చేసింది.

ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి వంద రోజుల వరకు ఉపాధి కల్పించే ఈ చట్టం కింద గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవలి సంవత్సరాలలో నిర్వహిస్తున్న జాబ్ కార్డుల భారీ తొలగింపులకు ఇది అదనంగా ఉంది. డూప్లికేట్ లేదా ఫేక్ కార్డ్‌లు, మరణాలు, కార్డ్ హోల్డర్లు పథకం కింద పని చేయడానికి ఇష్టపడకపోవడం తదితర అంశాల వల్లే తొలగిస్తున్నారని ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. లిబ్‌టెక్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌లో చేసిన అధ్యయనంలో దాదాపు 15 శాతం తొలగింపులు తప్పు అని తేలింది. "కార్మికుల పెరుగుదలకు బదులుగా, తొలగింపులు ఎక్కువ ఉన్నాయి. ఈ కొనసాగుతున్న ధోరణి గత రెండున్నరేళ్లలో ఏప్రిల్ 2022 నుండి సెప్టెంబరు 2024 వరకు తొలగించబడిన ఎనిమిది కోట్ల మందిలో నిజమైన పేదల భవితవ్యం ఆందోళన కలిగిస్తుంది" అని నివేదిక పేర్కొంది. ఈ నివేదిక మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ నుండి డేటాను అందించింది. గత ఆరు నెలల కాలంలో కొత్తగా 45.4 లక్షల మంది కార్మికులు చేరారని, అంటే మొత్తం కార్మికుల సంఖ్య 39.3 లక్షలు తగ్గిందని ఈ సంస్థ పేర్కొన్నది. ఎక్కువ మందిని తొలగించిన రాష్ట్రాల్లో మొదట తమిళనాడు (14.7 శాతం), ఆ తరువాత ఛత్తీస్‌గఢ్ (14.6 శాతం) ఉన్నాయి. కార్మికులను తొలగించడం కొన్నేళ్లుగా కొనసాగుతున్నదని, 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం 8 కోట్ల మంది కార్మికులను తొలగించినట్టు లిబ్‌టెక్ పేర్కొన్నది.

తగ్గుతున్న పని దినాలు

ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత పని దినాలు తగ్గుతున్నాయని ఈ సంస్థ పేర్కొన్నది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 16.6 శాతం వ్యక్తిగత పని దినాలు (ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఒక కార్మికుడు పని చేసే రోజులు) తగ్గనున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ – సెప్టెంబర్ మధ్య కాలంలో 154 కోట్ల వ్యక్తిగత పనిదినాలు గణనీయంగా పడిపోయాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 184 కోట్ల వ్యక్తిగత పని దినాలు నమోదయ్యాయి. 2023–24లో సంబంధిత కాలవ్యవధితో పోలిస్తే 2024–25 ఏప్రిల్–సెప్టెంబర్‌లో ఆరు రాష్ట్రాల్లో పనిదినాలు వృద్ధి చెందగా, 14 రాష్ట్రాలు వ్యక్తిగత పని దినాల సంఖ్య తగ్గుముఖం పట్టాయి.

ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ(ఎబిపిఎస్)ను తప్పనిసరి చేయడం కార్మికులకు ఇబ్బందిగా మారింది. ఇందుకోసం కార్మికుల జాబ్ కార్డుకు ఆధార్ లింక్ అవ్వాలి. ఆధార్, జాబ్ కార్డుపై పేరు సరిగ్గా పొంతన కుదరాలి. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ కావడంతోపాటు, ఎన్‌పిసిఐలో నమోదు కావాలి. వీటిల్లో ఏది లేకపోయినా కార్మికులు ఎబిపిఎస్‌కు అనర్హులుగా మారుతున్నారని, మొత్తం కార్మికుల్లో 27.4 శాతం మంది అనర్హులుగా పేర్కొన్నారని లిబ్‌టెక్ వివరించింది.

మహారాష్ట్ర పోరు

- కాంగ్రెస్, బిజెపి రెండో జాబితాల విడుదల
- 22 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఎన్‌సిపి (శరద్‌పవార్)



మహారాష్ట్ర : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు 23 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను కాంగ్రెస్ శనివారం విడుదల చేసింది. వీరిలో విదర్భ ప్రాంతానికి చెందిన నియోజకవర్గాల అభ్యర్థులే అత్యధికులు ఉన్నారు. నాగ్‌పూర్ సౌత్ నుంచి గిరీష్ పాండవ్, వార్ధా నుంచి శేఖర్ షిండే, యవత్‌మాల్ నుంచి అనిల్ మంగూల్కర్‌లకు కాంగ్రెస్ టిక్కెట్లు ఇచ్చింది. 25 మంది సిట్టింగులుసహా 48 మంది అభ్యర్థుల పేర్లతో కూడిన తొలి జాబితాను రెండు రోజుల క్రితం ఆ పార్టీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. మొత్తంగా 71 మంది అభ్యర్థులను ఇప్పటివరకూ ప్రకటించింది. మహారాష్ట్రకు ఎఐసిసి ఇన్‌ఛార్జిగా ఉన్న రమేష్ చెన్నితాల మాట్లాడుతూ మహావికాస్ అఘాడిలో ఎలాంటి విభేదాలు లేవని, ఐక్యంగా పోటీ చేస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకన్నా మెరుగైన ఫలితాలను ఎంవిఎ సాధిస్తుందని, పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పిసిసి చీఫ్ నానా పటోలె ధీమా వ్యక్తం చేశారు. మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) భాగస్వామ్య పక్షాలైన శివసేన (యుబిటి), ఎన్‌సిపి (శరద్ పవార్), కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటు కుదిరిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ఈ మూడు పార్టీలు 85 స్థానాల చొప్పున పోటీ చేస్తాయి.

22 స్థానాలకు ఎన్‌సిపి (శరద్‌పవార్) జాబితా విడుదల

శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మరో 22 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఎన్‌సిపి మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ రెండో జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు మొత్తం 67 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని చెప్పారు. మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. 9 కోట్ల 63 లక్షల మంది ఓటర్లు ఉండగా.. లక్షా 186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇసి ఇప్పటికే ప్రకటించింది.

బిజెపి రెండో జాబితా విడుదల

మహారాష్ట్ర ఎన్నికలకు 22 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను బిజెపి శనివారం విడుదల చేసింది. మొత్తంగా 121 స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టింది.

40 మంది బిజెపి స్టార్ క్యాంపెయినర్లు

ప్రధాని మోడీ, అమిత్ షాతో సహా 40 మందిని మహారాష్ట్ర ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్లుగా బిజెపి ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, అస్సాం, ఉత్తర ప్రదేశ్ సిఎంలు హిమంత బిశ్వ శర్మ, యోగి ఆదిత్యనాథ్ సహా 40 మంది ఉన్నారు.

జర్నలిస్టుల రక్షణకు చట్టాన్ని తీసుకురావాలి

- కేంద్రాన్ని కోరిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

న్యూఢిల్లీ : దేశంలో జర్నలిస్టుల భద్రత, రక్షణ కోసం ఒక చట్టాన్ని తీసుకురావాలని కేంద్రాన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) కోరింది. దేశంలో మీడియా సిబ్బంది అరెస్టులు, తప్పుడు నిర్బంధాలు, బెదిరింపులపై ప్రెస్ కౌన్సిల్ సభ్యులు గుర్బీర్‌సింగ్ రూపొందించిన నివేదికను పిసిఐ ఆమోదించింది. కౌన్సిల్ ఛైర్‌పర్సన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన్ ప్రకాశ్ దేశాయ్ నుంచి ఈ విషయంలో భిన్నాభిప్రాయం వ్యక్తమైనప్పటికీ.. నివేదికకు సమర్థన లభించటం గమనార్హం. ఈ నివేదిక కేంద్రానికి ప్రధానంగా మూడు ప్రతిపాదనలను చేసింది. అందులో మొదటిది.. దేశంలో జర్నలిస్టుల రక్షణ, భద్రత కోసం జాతీయ చట్టాన్ని ప్రకటించటం. అలాగే, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యాక్ట్‌కు మరిన్ని అధికారాలు కలిగించాలనీ, ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియాతో వ్యవహరించే విధానంపై పోలీసులకు అవగాహన కల్పించాలని, చట్టాన్ని అమలు పరిచే సంస్థల ప్రవర్తన నిబంధనలను క్రోడీకరించాలని నివేదిక పేర్కొన్నది. గతేడాది భారత్‌లో ఐదుగురు జర్నలిస్టులు హత్యకు గురయ్యారని, 226 మంది కొన్ని ప్రభుత్వ ఏజెన్సీలు, రాజకీయేతర, సంఘ విద్రోహ శక్తులు, నేరస్థులకు లక్ష్యంగా మారారని అందులో వివరించింది. ఈమేరకు ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినమైన మే 3న విడుదలైన ఇండియా ప్రెస్ ఫ్రీడమ్ వార్షిక నివేదికను ఇది ఉటంకించింది.

విద్యుత్తు భారాలపై ప్రజాగ్రహం

- సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా
- నియంత్రణ మండలి ఆదేశాల కాపీలు దహనం



తిరుపతిలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ధర్నా

ప్రజాశక్తి – యంత్రాంగం

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారం పేరుతో ప్రజలపై భారాన్ని మోపడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం ఆందోళనలు జరిగాయి. విద్యుత్తు కార్యాలయాలు, సబ్ స్టేషన్ల వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల కాపీలను దహనం చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం విజయవాడ నగర కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడారు. రూ.6,072 కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీలపై జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓవైపు అధిక ధరలు, మరోవైపు విద్యుత్ భారాలతో టిడిపి కూటమి ప్రభుత్వం ఉమ్మడి బాదుడు ప్రారంభించిందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీల జేబులు నింపటానికే దీపావళి సమయంలో ప్రజలకు విద్యుత్ షాక్ ఇచ్చిందని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, భారాలు తగ్గిస్తామని ఇచ్చిన ఆ హామీని విస్మరించడం తగదన్నారు. ట్రూ అప్ ఛార్జీలకుతోడు మరో రూ.11 వేల కోట్లపైగా భారం మోపడానికి సిద్ధమవుతోందని తెలిపారు. స్మార్ట్ మీటర్లను ఆపకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు బి వాసుదేవయ్య, ఎం నాగరాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి టి మద్దిలేటి, న్యాయవాది మణిచంద్ర రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం పలు సందర్భాల్లో పెంచిన విద్యుత్తు ఛార్జీలను చెల్లించలేక పేద, మధ్య తరగతి ప్రజలతోపాటు, సూక్ష్మ చిన్న పరిశ్రమల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం ట్రూ యాప్ ఛార్జీల భారం మోపడం వల్ల రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తిరుపతిలో లీలా మహల్ పక్కన చేపల మార్కెట్ ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాలుగు నెలలకే ప్రజానీకానికి మోత మోగించిందన్నారు. సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు టి.సుబ్రమణ్యం, విశ్వనాథం పాల్గొన్నారు. బాపట్ల జిల్లా చీరాలలో నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరావు, కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ పాల్గొన్నారు. అనంతపురంలో గుంతకలు, శింగనమల, ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

పశ్చిమాసియా ఉద్రిక్తతల పట్ల భారత్ ఆందోళన

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతుండడం పట్ల భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని పక్షాలు సంయమనం పాటించి, చర్చలు, దౌత్య పంథాను అనుసరించాలని కోరింది. పశ్చిమాసియాలోని తమ రాయబార కార్యాలయాలు అక్కడి భారతీయులతో నిరంతరం టచ్‌లో ఉన్నాయని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శక్తివంతమైన ఆయుధ సంపత్తి కలిగిన దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి ఆజ్యం పోసేలా ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడి చేసిన నేపథ్యంలో భారత్ స్పందన వెలువడింది. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆ ప్రాంత శాంతి సుస్థిరతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ ఘర్షణల వల్ల ఎవరికీ ప్రయోజనం వుండదని, మరోపక్క సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడతారని పేర్కొంది. అందువల్ల ఈ ఘర్షణతో ప్రమేయమున్న పక్షాలన్నీ కలిసి చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరింది.

స్వతంత్ర పాలస్తీనా ఒక్కటే పరిష్కారం

- ఇజ్రాయిల్, పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీల సంయుక్త ప్రకటన

రమల్లా : గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ దురాక్రమణను తక్షణమే నిలిపివేయాలని ఇజ్రాయిల్, పాలస్తీనాలోని కమ్యూనిస్ట్ పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ ప్రాంతంలో భద్రత, శాంతి, సుస్థిరత నెలకొనాలంటే స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు ఒక్కటే మార్గమని ఇజ్రాయెల్ కమ్యూనిస్ట్ పార్టీ, పాలస్తీనా పీపుల్స్ పార్టీ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ఆన్‌లైన్‌లో ఇరు పార్టీల నేతల మధ్య జరిగిన సమావేశం అనంతరం ఉమ్మడి ప్రకటన వెలువడింది. స్వతంత్ర పాలస్తీనాకు మద్దతిచ్చే వివిధ సంస్థలు ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొన్నాయి. అమెరికా సహాయంతో పాలస్తీనా ప్రజల హక్కులను పూర్తిగా హరించేందుకు ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందని సమావేశం అభిప్రాయపడింది. గాజా స్ట్రిప్ నుండి ఇజ్రాయిల్ సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించు కోవాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు తిరిగి రావాలని, వారి జీవనానికి హామీ ఇవ్వాలని ఉమ్మడి ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఇరాన్ పోలీసు కాన్వాయ్‌పై దాడి

- 10మంది అధికారుల మృతి

టెహరాన్ : రెస్టివ్ ఆగ్నేయ ఇరాన్‌లో శనివారం పోలీసు కాన్వాయ్‌పై జరిగిన దాడిలో 10మంది అధికారులు మరణించారని స్థానిక మీడియా తెలిపింది. ఇరాన్ రాజధాని టెహరాన్‌కు 1200 కిలోమీటర్ల దూరంలో గోహర్ కుహ్‌లో ఈ దాడి జరిగిందని పేర్కొంది. కొంతమంది దుండగులు ఈ దాడికి పాల్పడ్డారని ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇర్నా వార్తా సంస్థ వెల్లడించింది. అంతకుమించి వివరాలు పేర్కొనలేదు. ఈ దాడికి సంబంధించి అనుమానితులెవరినీ గుర్తించలేదు. ఏ గ్రూపు కూడా ఈ దాడికి తమదే బాధ్యత అని ప్రకటించలేదు. ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో ఈ దాడి కూడా చోటు చేసుకోవడం గమనార్హం.

ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌ల మూత

- వాటి స్థానంలో ప్రజాస్వామ్య, ప్రజాస్ఫూర్తి గల సంస్థలు రావాలి
- 200 సివిల్ సొసైటీ గ్రూపులు, వ్యక్తుల డిమాండ్

న్యూఢిల్లీ : ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)ల విషయంలో పౌర సంఘాలు, వ్యక్తులు తమ ఆందోళ వ్యక్తం చేశారు. మరింత ప్రజాస్వామ్య, ప్రజాస్ఫూర్తి గల సంస్థలకు దారి సుగమం చేసేందుకకు ఆ రెండు సంస్థలను మూసివేయాలని డిమాండ్ చేశారు. సుస్థిరత, సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చే కొత్త ప్రజాస్వామ్య, వికేంద్రీకరణ ఆర్థిక వ్యవస్థను రూపొందించాలని వారు పిలుపునిచ్చారు. దాదాపు 200 మంది తమ సంతకాలతో కూడిన ఒక ప్రకటనను విడుదల చేశారు. గత 80 ఏళ్లుగా పపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌లు వలసవాద తర్కం, దోపిడీకి మూలాధారమైన అభివృద్ధి, ఆర్థికీకరణ నమూనాను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్లోబల్ సౌత్ నుంచి గ్లోబల్ నార్త్‌కు సంపదను నిరంతరం బదిలీ చేయటంలో ఈ సంస్థలు దోహదపడ్డాయని ఆరోపించారు. దేశాలను తీవ్ర అప్పుల ఊబిలో బంధించి.. వాటి సహజ వనరులపై సార్వభౌమాధికారాన్ని కోల్పోయేలా చేస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ తీసుకొచ్చిన విధానాలను వీరు తప్పుబట్టారు. వీటి కారణంగా నీరు, విద్యుత్, విద్య, వైద్యం, రవాణాతో సహా అవసరమైన ప్రజా సేవల ప్రయివేటీకరణకు దారితీసిందని పౌర సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆరోపించారు. వీటి స్థానంలో తగిన ప్రాధాన్యత కలిగి ఉండే కొత్త సంస్థల ఏర్పాటు అవసరమని పిలుపునిచ్చారు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ 80వ వార్షికోత్సవం సందర్భంగా భారత పౌర సమాజం కొత్త ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థకు పిలుపునిచ్చింది.

మిలటరీ చొరవ, దౌత్యం ఫలించింది

- చైనాతో ఒప్పందంపై జైశంకర్



పూణే : చైనాతో సరిహద్దుల్లో గస్తీపై కుదిరిన ఒప్పందం వెనుక మిలటరీ కృషి ఎంతగానో వుందని విదేశాంగ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు. అనూహ్యమైన పరిస్థితుల్లో కృషి చేసిన సైన్యం, నేర్పరితనంతో సాగించిన దౌత్యం వల్ల ఈ విషయంలో పురోగతి సాధించామని ఆయన పేర్కొన్నారు. పూణేలో విద్యార్థులతో ఇష్టాగోష్టిలో అడిగిన ఒక ప్రశ్నకు ఆయన పై రీతిన స్పందించారు. ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొనడానికి ఇంకా కొంత సమయం పడుతుందన్నారు. ఇరు దేశాల విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారులు త్వరలో సమావేశమై ఎలా ముందుకు సాగాలో చర్యలు తీసుకోవాలని ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిశ్చయించారని చెప్పారు.. ఈ విషయంలో మన సైన్యం, అలాగే దౌత్యం రెండూ మంచి పాత్ర పోషించాయన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్ తన మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుచుకుందన్నారు. పదేళ్ల కిందటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం ఇందుకోసం ఐదు రెట్లు ఎక్కువగా వనరులను వినియోగిస్తున్నామన్నారు.

'నా బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు..'

- విలేకరుల సమావేశంలో కన్నీళ్లు పెట్టుకున్న షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2019 ఎన్నికల్లో నా శక్తికి మించి పని చేశా. 3,200 కిలో మీటర్ల పాదయాత్ర, ఓదార్పు యాత్ర, బైబై బాబు అంటూ ప్రచారం చేశా. మీకు ఇన్ని చేస్తే ... ఇప్పుడు నా బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు' అని పిసిసి అధ్యక్షురాలు షర్మిల అన్నారు. విజయవాడలోని గాంధీభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు ఆమెకు మధ్య కొద్ది రోజులుగా ఆస్తుల వివాదం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన చిన్నాన వై.వి సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ' నా బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు. వారికి అన్యాయం చేయాలని మీకు ఎలా అనిపించింది' అని అన్నారు. 'అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయి ఎందుకిలా మాట్లాడుతున్నారు? అని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ రోజు సుబ్బారెడ్డి, రేపు విజయసాయి వీళ్ళంతా జగన్ చేతిలోనే మనుషులేనన్నారు. వాళ్ల దగ్గర ఇంకా నిజాయితీ ఉంటుదని భావించానని, ఆ భావన సరైంది కాదని తెలిసిందని, ఈ విషయం విజయమ్మకూ అర్థం కావాలన్నారు. జగన్ పాలనలో సుబ్బారెడ్డి పదవులు పొందారని, ఆ పదువులను అడ్డుపెట్టుకుని ఆయన, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారని చెప్పారు. భారతి, సాక్షి సంస్థల్లో నలుగురు బిడ్డలకు సమాన వాటాలు ఉండాలని వైఎస్ఆర్ ఆకాంక్షించారని, ఇది నిజమన్నారు. ఈ విషయాన్ని నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెబుతానని, ఇది వాస్తవం కాదని, జగన్, సుబ్బారెడ్డిలు వారి బిడ్డలపై ప్రమాణం చేయాలని కోరారు. తన నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి చెడ్డ పేరు తేవడం తనకు ఇష్టం లేదని, అందుకే ఐదేళ్లుగా ఎంఒయూ తర దగ్గర ఉన్నా బయట పెట్టలేదన్నారు. తనకు లాభం జరుగుతుందంటే తల్లిని కూడా జగన్ కోర్టుకీడుస్తారని చెప్పారు. గతంలో తన బెయిలు కోసం వైఎస్ఆర్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చింది జగనే అని చెప్పారు.

రాజకీయ వేధింపులకు సంఘమిత్ర రేవతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అధికార పార్టీ నేతల వేధింపులు తాళలేక సంఘమిత్ర ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కథనం ప్రకారం.. తాటిపర్తి పంచాయతీ సంఘమిత్రగా రేవతి గత 16 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక నేతలు ఆమెను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఆమెకు వ్యతిరేకంగా గ్రామస్తుల వద్ద అబద్ధపు సంతకాలు చేయించి, మరొకరిని సంఘమిత్రగా పెట్టి పనులు చేయించారు. దీంతో తనకు న్యాయం చేయాలని అధికారులను, ఎమ్మెల్యేను రేవతి కోరారు. కొత్తగా వచ్చిన మహిళా ఎపిఒకి తన సమస్యను విన్నవించినా ఆమె కూడా కూటమి నేతల మాటకే కొమ్ముకాయడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేకోవడానికి మందు తాగారు. ఈ సందర్భంగా తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.

'సిఐటియు' పరామర్శ

రేవతిని సిఐటియు నాయకులు పరామర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, దళితులు ఉద్యోగాలు కోల్పోతున్నారని సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగినా నేతలకు, అధికారులకు ఏమాత్రమూ పట్టలేదని జిల్లా కార్యదర్శి గురవయ్య మండిపడ్డారు. ఫలితంగానే సంఘమిత్రలు, అంగన్‌వాడీలు అధికార వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రేవతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భౌతిక శాస్త్రవేత్త రోహిణి గాడ్‌బోలే కన్నుమూత



పూణె : పద్మశ్రీ గ్రహీత, కణ భౌతిక శాస్త్రవేత్త రోహిణి గాడ్‌బోలే పూణెలో శుక్రవారం కన్నుమూశారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఒక సంతాప నోట్‌లో ఇలా పేర్కొంది. "ప్రొఫెసర్ రోహిణి గాడ్‌బోలే మృతికి చాలా బాధతో మేము ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం. ఈ తెల్లవారుజామున నిద్రలోనే ఆమె ప్రశాంతంగా కన్నుమూశారు. గొప్ప శాస్త్రవేత్తగానే కాకుండా, ఆమె గొప్ప నాయకురాలు, గైడ్, సహోద్యోగి, స్నేహితురాలు. ఆమె సైన్స్‌లో మహిళల ఛాంపియన్. ప్రొఫెసర్ గాడ్‌బోలే 1995లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్‌లో చేరారు. 2018లో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశారు. ఆమె పద్మశ్రీ, ఫ్రాన్స్ నుండి ఆర్డర్ నేషనల్ డు మెరైట్‌తో సహా అనేక ప్రశంసలు, అవార్డులను సాధించారు. వివిధ అకాడమీల సభ్యత్వాలను కలిగి ఉన్నారు. ప్రొఫెసర్ గాడ్‌బోలే భారతదేశంలోనే కాకుండా విదేశాలలో ప్రభుత్వాలకు వివిధ సలహా కమిటీలలో కూడా పనిచేశారు' అని వివరించింది.

ఐసిఐసిఐకి రూ.11,746 కోట్ల లాభాలు

ముంబయి : దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసిఐసిఐ బ్యాంక్ 2024–25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 14.5 శాతం వృద్ధితో రూ.11,746 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. వడ్డీయేతర ఆదాయం, ఫీజుల ఆదాయం, ట్రెజరీలో పెరుగుదల మెరుగైన లాభాలకు దారి తీశాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 10,261 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.34,920 కోట్లుగా ఉన్న వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ2లో 16.8 శాతం లేదా రూ.5,616.99 కోట్లు పెరిగి రూ.40,537.38 కోట్లకు చేరింది. పెట్టుబడులపై ఆదాయం 18.38 శాతం వృద్ధితో రూ.8,311.33 కోట్లుగా నమోదయ్యింది.



మీకోసం

చేపముక్కలకు కొద్దిగా ఉప్పు కలిపి డీప్ ఫ్రిజ్‌లో ఉంచితే ఒకదానికొకటి అంటుకోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం.. ప్రతి వ్యక్తికి అవసరం.

ప్రకృతి



నిరంతరం భూ భ్రమణం
అనవరతం సూర్యచంద్రుల గమనం
కాలానుగుణ రుతువుల ఆగమం
పరంపరంగా ప్రకృతి ధర్మం!

ఎత్తయిన పర్వతాలు
గలగల పారే సెలయేళ్ళు
జలజల దూకే జలపాతాలు
ప్రకృతి సుందర దృశ్యాలు
దట్టమైన అడవులు
పచ్చని ఉద్యాన వనాలు
విస్తారమైన తోటలు
ప్రకృతి అందాలు
ఆకాశాన మెరిసే తారలు
అవనిలో ఎగిసిపడే కడలి కెరటాలు
పాయలు పాయలుగా పారేటి జీవనదులు
ప్రకృతి వర ప్రసాదాలు
రంగు రంగుల పక్షులు
రక రకాల జలచరాలు
వింత వింత వన్య మృగాలు
ప్రకృతి జీవ వైవిధ్య జీవకళలు
ప్రతి జీవికి ప్రకృతి మూలం
జీవకోటికి రక్షణ కవచం
ప్రకృతి పరవశిస్తే అనుగ్రహం..!
ప్రకృతి ప్రకోపిస్తే ప్రళయం..!!

– పి.వి.ప్రసాద్, 9440176824

నేను గీసిన బొమ్మ



బుడుమూరు వైనవి,
9వ తరగతి,
కేంద్రీయ విద్యాలయ నెం-1,
శ్రీ విజయ నగర్, విశాఖపట్నం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఏళ్లకు ఏళ్లు వెంటాడే భయాలు..!

ఆదిమ కాలం నుంచి ఆధునిక కాలం వరకూ ఆమె తరచూ వివక్షకు, ఇక్కట్లకు, ఆంక్షల చెరసాలకూ బలవుతూనే ఉంది. తప్పు చేసిందని బహిష్కరించడం, చెట్టుకు కట్టేసి కొట్టడం, బట్టలు ఊడదీయడం వంటివి ఇప్పటికీ ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఆమె ఆమెగా గౌరవం పొందే తరుణం కోసం దీర్ఘకాలం ప్రయాణం సాగించాల్సిందే! ఆమె రోజూ ఎదుర్కొనే హింసలో లైంగిక వేధింపుల అంశం ఎప్పుడూ ముందుపీఠినే ఉంటుంది. అలాంటి హింసతో నిత్యం సతమతమవుతూ మానసికంగా కుంగిపోతున్న కొంతమంది మహిళల అనుభవాలు, నిపుణుల హెచ్చరికలు ఇప్పుడు చర్చించుకోవాల్సిన సందర్భం..



కేరళకి చెందిన 25 ఏళ్ల పల్లవి (పేరు మార్చాం.)కి పెళ్లయింది. భర్తతో ఆమె నిత్యం నరకం చూసింది. లైంగికంగా అతను ఎంతో వేధించాడు. ఆ ప్రభావం పల్లవి మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. అతని నుంచి విడిపోయినా ఆ గాయం ఆమెని వెంటాడుతోంది. 'అతను చేసిన హింస వల్ల నా శరీరాన్ని నేను అసహ్యించుకున్నాను. హింసించుకున్నాను. చాలా కాలం నా మీద నాకే కోపం వచ్చేది. దీన్ని నుండి బయటికి రావడానికి నాకు చాలాకాలం పట్టింది' అంటోంది.

ఇప్పటికీ అది గుర్తొస్తుంది..

23 ఏళ్ల రియా, తన స్నేహితురాలితో కలసి చర్చికి వెళుతోంది. అప్పుడు ఆమె కుర్తా ధరించింది. ఆ ప్రాంతమంతా జనసందోహంగా ఉంది. అక్కడే.. ఓ ఆకతాయి, ఆమె కుర్తాని వెనుకవైపు నుంచి పైకి ఎత్తాలని ప్రయత్నించి సఫలమయ్యాడు. ఆ క్షణం రియా భయంతో వణికిపోయింది. అతడ్ని పట్టుకోవాలని చూసినా వాడు గుంపులో కలిసిపోయాడు. ఆ రోజు ఘటన నుంచి ఆమె ఇంకా కోలుకోలేదు. 'ఈ సంఘటన జరిగి చాలా కాలమైంది. అయినా ఇప్పుడు కూడా నేను కుర్తా వేసుకున్నప్పుడల్లా వెనక్కి తిరిగిచూసుకుంటూ నడుస్తున్నాను. ఆ రోజు నేను పెద్ద ప్రమాదం నుంచి బయటపడినట్లు అనిపించింది. కానీ దాని తాలూకు భయం మాత్రం నన్ను వెంటాడుతోంది. ఇది ఎప్పటికి పోతుందో అర్థం కావడం లేదు' అని ఆమె చెబుతోంది.

ఇంటర్వ్యూలో కూడా ...

ముంబయికి చెందిన 22 ఏళ్ల మహిళా ఉద్యోగిని తన అనుభవాన్ని ఇలా షేర్ చేస్తోంది. 'నేను ఇంటర్వ్యూకి హాజరైనప్పుడు అక్కడ 40 ఏళ్ల విద్యావంతుడు, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ హఠాత్తుగా నా దగ్గరికి వచ్చి అనుచితంగా తాకాడు. నేను వెంటనే వెనక్కి అడుగేశాను. నా అనుమతి లేకుండా ఎందుకు అలా చేశారని నిలదీశాను. నేను ఇంత ఆవేదనగా మాట్లాడుతుంటే అతను ఆ విషయాన్ని చాలా తేలికగా తీసుకున్నాడు...'

మనదేశంలో ...

భారత్‌తో సహా, వివిధ దేశాల్లో మహిళల మానసిక ఆరోగ్యం దెబ్బతినడంలో లైంగిక హింస ఒక కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా చెప్పింది. 2021 అక్టోబరులో వచ్చిన ఒక నివేదిక ప్రకారం, భారత్‌లో మానసిక ఆరోగ్యం దెబ్బతిన్న మహిళల్లో 39 శాతం మంది ఒత్తిడి వల్ల, 30 శాతం మంది ఆందోళన కారణంగా, మిగిలిన వారు లైంగిక హింస కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తేలింది.

లైంగిక హింస ఎదుర్కొని మానసికంగా ఇబ్బందులు పడుతున్న మహిళలకు చికిత్స అందించిన బెంగుళూరు హాస్పటల్ నర్సు మేఘా తన అనుభవాలను ఇలా చెబుతున్నారు...: 'దాడికి గురై బతికిన వారు అనేక రకాల మానసిక భావోద్వేగ సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభావం వ్యక్తి నుంచి వ్యక్తికి మారవచ్చు. నిద్రలో ఉలిక్కి పడి లేవడం, అనుచిత ఆలోచనలతో సతమతమవ్వడం, నిద్ర పట్టకపోవడం, నిర్లిప్తత వంటివెన్నో వారిని వేధిస్తాయి. నవ్వడం, సంతోషంగా ఉండడంపై వారు ఎప్పుడూ ఆసక్తి చూపరు. నిద్రలోనే కాదు, ఆహారంలో కూడా విపరీత మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా అధిక బరువు, బరువు కోల్పోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటారు. గుర్తింపు, ఆత్మగౌరవం పోయిందని బాధపడతారు' అని మేఘ వివరించారు.

నిపుణులు ఏం చెబుతున్నారంటే..

'భారతీయ మహిళల్లో చాలామంది ఆరోగ్యానికి ముఖ్యంగా మానసిక ఆరోగ్యానికి పెద్దగా ప్రభావం చూపరని కేరళ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మాజీ డీన్, సైక్రియాట్రిస్ట్ ఆఫ్ రీసెర్చర్ డాక్టర్ షాజీ అంటున్నారు. ఒత్తిడి అనేది ప్రపంచవ్యాప్తంగా సర్వసాధారణమైన మానసిక ఆరోగ్య సమస్య. ఈ సమస్య పునరుత్పత్తి దశలో ఉన్న మహిళల్లో ఎక్కువగా ఉంటోంది. ఆ వయసులో లైంగికంగా వారు ఎదుర్కొనే బాధాకరమైన అనుభవాలు ఈ దుర్బలత్వానికి దోహదం చేస్తున్నాయి. సాధారణంగానే ఆ వయసు మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి, జీవవైవిధ్యం వారిని మరింత కుంగదీస్తుంది'.

మానసిక ఆరోగ్యం దెబ్బతిన్న మహిళలు చికిత్స తీసుకోవడంపై కూడా షాజీ వివరించారు. ఒత్తిడితో బాధపడుతున్న మహిళలు రెండు కారణాల వల్ల మానసిక ఆరోగ్యానికి చికిత్స తీసుకోరని చెబుతున్నారు. ఒత్తిడి అనేది వైద్యపరమైన పరిస్థితి అని అర్థం చేసుకోవడం లేదు. సాధారణంగా ఆయా పరిస్థితుల్లో నెలకొనే అసంతృప్తి, ఆందోళనగానే ఒత్తిడిని పరిగణిస్తారు. మానసిక నిపుణులు కాని వైద్యులు కూడా తరచూ ఈ లోపాన్ని గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఇది మొదటి కారణం. ఇక రెండవది.. అవగాహన లేక సకాలంలో ఒత్తిడికి సరైన చికిత్స తీసుకోకపోవడం. నిపుణులను సంప్రదించకపోవడం' అని వివరించారు.

'కుటుంబం, పనిప్రదేశాలు, ఆర్థికఅంశాలు మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను బహిర్గతం చేయకుండా కట్టడి చేస్తున్నాయ'ని చెన్నయ్ అపోలో హాస్పటల్ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ హేమీ థారూర్ అంటున్నారు. 'గర్భధారణ, గర్భస్రావం, ప్రసవానంతర మహిళలు తరచూ ఎదుర్కొనే మానసిక ఒత్తిడి కూడా ఈ తరహాలోనిదే'నని అని ఆమె అభిప్రాయపడుతున్నారు.

మహిళల మానసిక ఆరోగ్యం కేవలం వ్యక్తిగతం లేదా కుటుంబ సమస్య మాత్రమే కాదని గుర్తించాలి. తక్షణ శ్రద్ధ, తగు చర్యలు తీసుకోవాలి. ఇది చాలా ముఖ్యమైన ప్రజారోగ్య ఆందోళన. మానసిక ఆరోగ్య సేవలకు, అవగాహన కార్యక్రమాలను అభివృద్ధి చేయడం తక్షణావసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లైంగిక హింస - మానసిక ఆరోగ్యం

లైంగిక హింస మహిళల మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. రష్మీరాయ్, అంబరీష్ కుమార్ రాయ్ సమర్పించిన పరిశోధనా పత్రాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా 50 శాతం కంటే ఎక్కువమంది మహిళల మానసిక ఆరోగ్యం దెబ్బతినడానికి లైంగిక హింస ఒక కారణంగా ఉందని స్పష్టం చేసింది. బాధితురాలిపై ఆ సంఘటన, దాడి చేసిన వ్యక్తుల ప్రభావం దీర్ఘకాలం కొనసాగుతుందని నివేదికలో తెలిపారు. ఆస్పత్రి కేంద్రంగా పరిశోధించిన ఈ నివేదికలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళలు ఆందోళన, నిద్రలేమి, విపరీత ప్రవర్తనలు, తీవ్రమైన ఒత్తిడి, రుగ్మత వంటి మానసిక వ్యాధులతో బాధపడుతున్నారు. బాధాకరమైన విషయమేమంటే లైంగిక వేధింపులకు గురైన మహిళలు, వారి మానసిక ఆరోగ్య సమస్యలు కారణంగా తరచూ లైంగికవేధింపులకు గురవుతున్నారు.



నేడు దళపతి విజయ్ భారీ బహిరంగ సభ

తమిళ హీరో దళపతి విజయ్ తాజాగా 'గోట్' సినిమాలో అలరించిన విషయం తెలిసిందే. 2026 ఎన్నికలే లక్ష్యంగా తమిళగ వెట్రి కళగం పార్టీని ఆయన స్థాపించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా విక్రవాండిలోని వీసాలైలో తొలిసారిగా పార్టీ మహానాడును ఏర్పాటు చేశారు. పార్టీ ఏర్పాటుచేసిన తొలి బహిరంగ సభ కావటంతో ఆయన ఏమి మాట్లాడతారనే విషయమై అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. రెండు చేతులెత్తి మొక్కుతున్నా... అభిమానులంతా పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.



అజనీష్ సంగీతంలో 'ఎస్‌డిటి-18'

సాయి దుర్గ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఎస్‌డిటి-18' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. రోహిత్ కెపి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ సాలిడ్ అప్డేట్‌ని మేకర్స్ రివీల్ చేశారు. ఈ సినిమాకు 'కాంతార' వంటి చిత్రానికి సంగీతం అందించిన అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని అందించబోతున్నారు. ఈ విషయాన్ని ఓ గ్లింప్స్ ద్వారా మేకర్స్ వెల్లడించారు. ఐశ్వర్య లక్ష్మీ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.



నట ప్రస్థానానికి 50 ఏళ్లు..

చిరంజీవి సినిమా రంగంలోకి అడుగుపెట్టి చాలా ఏళ్ళు అయ్యింది. అయితే వెండితెర కంటే ముందే ఆయన నటుడుగా, డ్యాన్సర్‌గా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే తాజాగా చిరంజీవి ఒక అరుదైన మెమొరీని సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. తాను బికాం చదువుతున్న రోజుల్లో వేసిన నాటకం కోసం ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు. 'రాజీనామా' వైఎన్ఎం కాలేజీ నర్సాపూర్‌లో 'రంగస్థలం' మీద తొలి నాటకం .. కోన గోవిందరావు గారి రచన. నటుడిగా తొలి గుర్తింపు .. అది ఉత్తమ నటుడు కావటం.. ఎనలేని ప్రోత్సాహం..1974 నుంచి 2024కి 50 సంవత్సరాలు తన నట ప్రస్థానానికి పూర్తయ్యింది' అని చిరు పోస్ట్ చేశారు. అప్పటి పేపర్ కట్‌ని కూడా షేర్ చేశారు.



Mr. K. S. S. V. Prasada Rao, II B. Com.,
Best actor of the college 1974-75.


హిందీ, తెలుగులో సాయిపల్లవి డబ్బింగ్

హీరోయిన్ సాయిపల్లవి మాటతీరు చాలా వైవిధ్యంగా ఉండే విషయం తెలిసిందే. త్వరలోనే విడుదల కానున్న 'అమరన్' సినిమా కోసం ఆమె డబ్బింగ్ చెప్పారు. మేజర్ ముకుందన్ బయోపిక్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. శివ కార్తికేయన్ హీరో. దీపావళి సందర్భంగా ఈ సినిమా పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. తెలుగు, హిందీలో ఆమె తన పాత్రలకు డబ్బింగ్ చెప్పారు. నాగచైతన్య హీరోగా నటిస్తున్న 'తండేల్' సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత మరో రెండు కొత్త సినిమాల్లో ఆమె నటించనున్నారు.



విరాళాల కోసం రేణుదేశాయ్ వినతి

సినీ నటి, సామాజిక కార్యకర్త రేణుదేశాయ్ విరాళాల కోసం తన ఇన్‌స్టాలో వీడియో విడుదల చేశారు. మూగ జీవాల సంరక్షణ కోసం ఎవరైనా స్వచ్ఛందంగా తమ వంతు బాధ్యతగా ప్రతినెలా కనీసం రూ.100 సాయం చేయాలని కోరారు. ఈ మొత్తం తన వ్యక్తిగత అవసరాల కోసం కాదనీ, తాను స్థాపించిన స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సేవ చేయటానికి అని తెలిపారు.



బాల్యం నుంచి తనకు మూగ జీవాలను సంరక్షించటం ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. దీనికోసం చాలాసార్లు ప్రయత్నించినట్లుగా వివరిం చారు.

మూగ జీవాల్ని సంరక్షించాలనీ, వాటికోసం ఇంకా ఏదైనా చేసేందుకు తన గళాన్ని వినిపించాలని కోవిడ్ సమయంలో తాను నిర్ణయించుకున్నట్లుగా పేర్కొన్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా ఎన్జీవోను కూడా రిజిస్ట్రేషన్ చేయించినట్లుగా వివరించారు.

కివీస్ చారిత్రక విజయం

భారత్‌లో తొలిసారి టెస్టు సిరీస్ ఆ జట్టు కైవసం
రెండో టెస్టులోనూ టీమిండియా పరాజయం
359 పరుగుల ఛేదనలో 245కు ఆలౌట్



శ్రీలంక చేతిలో టెస్టు సిరీస్ ఓటమి. ఉత్తమ బ్యాటర్ కేన్ విలియమ్సన్ సేవలు దూరం, కెప్టెన్ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఈ పరిస్థితుల్లో సొంతగడ్డపై వరుసగా 18 సిరీస్‌ల్లో ఓటమెరుగని టీమ్ ఇండియాతో సమరం. సహజంగానే న్యూజిలాండ్‌పై కొండంత ఒత్తిడి కనిపించింది.

న్యూజిలాండ్ క్రికెట్ బేసిక్స్‌ను పాటించింది. బలమైన భారత్‌పై ఒక్కో అడుగే వేస్తూ ఆధిపత్యం చూపించింది. బెంగళూర్‌లో పేస్ స్పిన్‌ను విజయంతో 36 ఏండ్లలో భారత్‌లో తొలి టెస్టు విజయం సాధించగా.. పుణెలో స్పిన్ పిచ్‌పై విజయంతో భారత గడ్డపై చారిత్రక తొలి టెస్టు సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో టెస్టులో భారత్ 113 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 359 పరుగుల ఛేదనలో భారత్ 245 పరుగులకే కుప్పకూలింది. భారత్‌తో మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ 2-0తో తిరుగులేని ఆధిక్యం సాధించింది. 12 ఏండ్ల తర్వాత భారత్ స్వదేశంలో ఓ టెస్టు సిరీస్‌లో పరాజయం చవిచూసింది. వరుసగా 18 సిరీస్‌ల విజయ పరంపరకు పుణెలో బ్రేక్ పడింది.

పుణె : న్యూజిలాండ్ సాధి ంచింది. భారత్‌ను భారత్‌లో ఓడించింది. పుణె టెస్టులో టీమ్ ఇండియాను అన్ని విభాగాల్లోనూ వెనక్కి నెట్టిన న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో చారిత్రక విజయం సాధించింది. గత 12 ఏండ్లలో భారత్‌కు స్వదేశంలో ఇది తొలి సిరీస్ ఓటమి కాగా.. న్యూజిలాండ్‌కు భారత గడ్డపై ఇదే తొట్టతొలి టెస్టు సిరీస్ విజయం కావటం విశేషం. 359 పరుగుల ఛేదనలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (77, 65 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సలు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగినా.. సహచర బ్యాటర్ల నుంచి సహకారం దక్కలేదు. రవీంద్ర జడేజా (42, 84 బంతుల్లో 2 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (21, 47 బంతుల్లో 2 ఫోర్లు), అశ్విన్ (18, 34 బంతుల్లో 2 ఫోర్లు) సహ శుభ్‌మన్ గిల్ (23, 31 బంతుల్లో 4 ఫోర్లు) భారత్‌కు గౌరవప్రద ఓటమికి అందించగలిగారు. కెప్టెన్ రోహిత్ శర్మ (8), విరాట్ కోహ్లి (17), రిషబ్ పంత్ (0), సర్ఫరాజ్ ఖాన్ (9) తేలిపోయారు. కివీస్ స్పిన్నర్ మిచెల్ శాంట్నర్ (6/104) ఆరు వికెట్ల మాయజాలంతో భారత్ 245 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు, టామ్ లేథమ్ (86), గ్లెన్ ఫిలిప్స్ (48), టామ్ బ్లండెల్ (41) మెరవటంతో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 255 పరుగులు చేసింది. భారత స్పిన్నర్ వాషింగ్టన్ నాలుగు వికెట్లు కూల్చాడు. 13 వికెట్లతో మాయాజాలం చేసిన మిచెల్ శాంట్నర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. 3 మ్యాచుల టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ 2-0తో ఎదురులేని ఆధిక్యం సాధించింది. భారత్, న్యూజిలాండ్ మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబయిలో ఆరంభం కానుంది.

జైస్వాల్ ఆశలు రేపినా :

359 పరుగుల లక్ష్యం. నాల్గో ఇన్నింగ్స్‌లో కష్టసాధ్యమైన టార్గెట్. కివీస్ స్పిన్నర్ల ఎదురుదాడి కాచుకుని భారత్ లక్ష్యం దిశగా సాగటం కష్టమే అనిపించింది. కానీ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (77) భారత్ శిబిరంలో ఆశలు రేపాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (8) మరోసారి విఫలమైనా.. శుభ్‌మన్ గిల్ (23, 31 బంతుల్లో 4 ఫోర్లు) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఓ వైపు మిచెల్ శాంట్నర్ మాయ చేసినా.. మరో ఎండ్ నుంచి పరుగుల వేట సాగించాడు. జైస్వాల్ ధనాధన్‌కు గిల్ పోరాటం తోడవటంతో లంచ్ విరామ సమయానికి భారత్ 12 ఓవర్లలోనే 81 పరుగులు చేసింది. 6.75 రన్‌రేట్‌తో ఛేదనను పట్టాలెక్కించిన యశస్వి న్యూజిలాండ్ వెనుకడుగు వేసేలా చేశాడు. కానీ లంచ్ విరామం తర్వాత సీన్ మారిపోయింది. 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధ సెంచరీ సాధించాడు. కానీ శుభ్‌మన్ గిల్ మరో ఎండ్‌లో వికెట్ల పతనాన్ని ఆపలేకపోయాడు. శాంట్నర్ ఉచ్చులో పడిన గిల్ పెవిలియన్‌కు చేరుకున్నాడు. రిషబ్ పంత్ (0) అనవసర పరుగు కోసం వెళ్లి వికెట్ పారేసుకోగా.. విరాట్ కోహ్లి (17) దారుణంగా విఫలమయ్యాడు. యశస్వి జైస్వాల్ క్రీజులో ఉండగా 127/2తో బలంగా కనిపించిన భారత్.. అతడి పతనంతో చేతులెత్తేసింది. లోయర్ ఆర్డర్‌లో వాషింగ్టన్ సుందర్ (21), రవీంద్ర జడేజా (42), రవిచంద్రన్ అశ్విన్ (18) మెరిసినా.. భారత్‌ను ఓటమి నుంచి తప్పించలేకపోయారు. ఓ ఎండ్‌లో నిరాకంటంగా మాయ చేసిన మిచెల్ శాంట్నర్ ఆరు వికెట్లతో భారత్‌ను ఆలౌట్ చేశాడు. అజాజ్ పటేల్ 2, గ్లెన్ ఫిలిప్స్ ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు. 60.2 ఓవర్లలో 245 పరుగులకు భారత్ కథ ముగిసింది.

ఆ ఇద్దరు మెరువగా :

ఓవర్‌నైట్ స్కోరు 198/5తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్ మరో 57 పరుగులు జోడించింది. టామ్ బ్లండెల్ (41, 83 బంతుల్లో 3 ఫోర్లు) త్వరగా అవుటైనా.. గ్లెన్ ఫిలిప్స్ (48 నాటౌట్) అజేయ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. టెయిలెండర్లు త్వరగా నిష్క్రమించినా ఓ ఎండ్ నుంచి విలువైన పరుగులు పిండుకున్నాడు. దీంతో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : 259/10
భారత్ తొలి ఇన్నింగ్స్ : 156/10
న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ : 255/10


భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) డార్లీ (బి) శాంట్నర్ 77, రోహిత్ శర్మ (సి) యంగ్ (బి) శాంట్నర్ 8, శుభ్‌మన్ గిల్ (సి) డార్లీ (బి) శాంట్నర్ 23, విరాట్ కోహ్లి (ఎల్బీ) శాంట్నర్ 17, రిషబ్ పంత్ (రనౌట్) 0, వాషింగ్టన్ సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21, సర్ఫరాజ్ ఖాన్ (బి) శాంట్నర్ 9, రవీంద్ర జడేజా (సి) సౌథీ (బి)అజాజ్ 42, ఆకాశ్ దీప్ (సి) రచిన్ (బి) అజాజ్ 1, జస్‌ప్రీత్ బుమ్రా నాటౌట్ 10, ఎక్స్‌ట్రాలు : 19, మొత్తం : (60.2 ఓవర్లలో ఆలౌట్) 245.

వికెట్ల పతనం : 1-34, 2-96, 3-127, 4-127, 5-147, 6-165, 7-167, 8-206, 9-229, 10-245.

బౌలింగ్ : సౌథీ 2-0-15-0, ఓరౌర్క్ 1-0-5-0, శాంట్నర్ 29-2-104-6, అజాజ్ 12.2-0-43-2, ఫిలిప్స్ 16-0-60-1.

స్పిన్‌కు టీమిండియా విలవిల

2021 నుంచీ టర్న్ పిచ్‌లపై ఇదే వ్యథ



ఆధునిక క్రికెట్‌లో స్పిన్‌ను బాగా ఆడే జట్టుగా టీమ్ ఇండియాకు పేరుంది. భారత ఆటగాళ్లు సైతం నెట్ సెషన్లలో పెద్దగా స్పిన్‌పై సాధన చేసేందుకు పెద్దగా ఇష్టపడేవారు కాదు. కానీ ప్రాక్టీస్ సెషన్లలోనూ పేస్‌ను జాగ్రత్తగా ఎదుర్కొనేవారు. స్పిన్ ఆడటంలో భారత ఆటగాళ్లను మాస్టర్స్‌గా పరిగణించేవారు. గణాంకాలు సైతం అందుకు అద్దం పట్టేవి. ఫలితంగా, సొంతగడ్డపై భారత్‌ను ఓడించటం ఆసీస్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, కివీస్ వంటి మేటీ జట్లకు సైతం అసాధ్యంగా మారింది. భారత ఆటగాళ్లు స్పిన్ మాస్టర్స్‌మనే భ్రమల నుంచి బయటకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. 2021 నుంచి భారత క్రికెటర్లు తిరిగే బంతిని ఆడేందుకు తికమక పడుతున్నారు. భారత పిచ్‌లపై మన స్పిన్నర్లు, ప్రత్యర్థి స్పిన్నర్లపై పైచేయి సాధించగా.. మన బ్యాటర్లపై ప్రత్యర్థి జట్ల బ్యాటర్లు పైచేయి సాధించటం కొంపముంచింది. ఫలితంగా సొంతగడ్డ కంచుకోట బీటలువారింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68